నేటి కందం-నేటికి అందం

ఖలులై సముద్ర వ్యాపా
రులపై దాడులు జరిపెడి లుఛ్ఛాలగు దొం
గలపై మన నౌకా బల
మలవోకగ జయము నొందె నందరు మెచ్చన్ !!

(వాణిజ్య నౌకల మీద దాడి చేసిన సముద్రపు దొంగల మీద భారత నౌకాదళం వీరోచితంగా పోరాడి తరిమి వేసి నౌకలకు రక్షణ కల్పించి అంతర్జాతీయ ప్రశంసలను అందుకున్నది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

చురక

తలాఖ్ హలాలాలు
తాకట్టు స్త్రీ స్వేచ్ఛకు
ముగింపు ఇంకెప్పుడు
మతంపేర ఈ మచ్చకు
సనాతన మూఢత్వం
సాగదనీ నిషేధం
కోర్టు తీర్పు వచ్చినా
కొనసాగే విషాదం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 5-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:257 పేజీలు:6 వెల: రూ.1/-


## జోధ్‌పూర్‌కు అత్యాధునిక ఎయిర్‌పోర్ట్ టెర్మినల్



**-రూ.480 కోట్ల ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని మోదీ**
**-రాజస్థాన్ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా కొత్త టెర్మినల్ నిర్మాణం**
**-ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు..**
**-సవరించిన ఉడాన్ పథకాన్నీ ప్రారంభించిన ప్రధాని**

న్యూ ఢిల్లీ, జులై 4:దేశీయ విమానయాన రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ విమానాశ్రయంలో రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక నూతన టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సవరించిన ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఆధునిక సదుపాయాలతో పాటు రాజస్థాన్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ టెర్మినల్ ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊతం ఇవ్వనుంది.

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ విమానాశ్రయం నూతన టెర్మినల్ భవనం ప్రారంభంతో ఆ ప్రాంత విమాన రవాణా వ్యవస్థ మరింత విస్తరించనుంది. సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ టెర్మినల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అదే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం సవరించిన ఉడాన్ పథకాన్ని కూడా దేశానికి అంకితం చేశారు.

కొత్త టెర్మినల్‌ను పూర్తిగా ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించడంతో పాటు, రాజస్థాన్ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపకల్పన చేశారు. సంప్రదాయ రాజస్థానీ శిల్పకళను గుర్తు చేసే కమాన్లు, ఝురోఖాలు, అలంకార నిర్మాణ శైలిని భవనంలో పొందుపరిచారు. దీంతో ఆధునికత, సాంప్రదాయ వైభవం సమన్వయంగా కనిపించేలా టెర్మినల్ రూపుదిద్దుకుంది.

ఈ టెర్మినల్ ద్వారా ఏటా సుమారు 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం ఏర్పడింది. ఒకేసారి దాదాపు 1,000 మంది ప్రయాణికుల రద్దీని నిర్వహించేలా విశాలమైన వేచి ఉండే ప్రదేశాలు, చెక్-ఇన్ కౌంటర్లు, భద్రతా సదుపాయాలు, ఇతర ప్రయాణికుల సౌకర్యాలను కల్పించారు.

విమానాల నుంచి నేరుగా టెర్మినల్‌కు ప్రయాణికులు చేరుకునేలా ఆరు ఏరోబ్రిడ్జ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ భవనాన్ని గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాల ప్రకారం నిర్మించారు. విద్యుత్ ఆదా, సహజ కాంతి వినియోగం, శక్తి సామర్థ్య వ్యవస్థలు, పర్యావరణహిత నిర్మాణ విధానాలతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేశారు.

కొత్త టెర్మినల్‌తో జోధ్‌పూర్‌కు దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాక పెరగడంతో పాటు వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. స్థానికంగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరగడంతో ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. సవరించిన ఉడాన్ పథకం ద్వారా దేశంలోని చిన్న పట్టణా లు, ప్రాంతీయ నగరాలకు విమా న సౌకర్యాలను మరింత విస్తరిం చడంతో పాటు, సాధారణ ప్రజ లకు తక్కువ వ్యయంతో విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావ డవే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు.

## ఆరు నెలలు లూప్ లైన్ లో పని చేస్తే ప్రమోషన్

హైదరాబాద్, జులై 4: 2012 బ్యాచ్ ఎస్ఐల దుస్థితి జూనియర్లకు సెల్యూట్ చేయాల్సిన దౌర్భాగ్యం అని ఆంధ్రప్రభ లో జూన్ 29న ప్రచురితమైన కథనాలకు రాష్ట్ర డిజిపి స్పందించారు. 2012 బ్యాచ్ కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లు కనీసం ఆరు నెలల పాటు డిప్యూటేషన్ లేదా లూప్ లైన్ లో పని చేస్తే ప్రమోషన్ ఇస్తామని తెలియజేశారు. రాష్ట్రంలోని పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సో రాష్ట్ర పోలీస్ బాస్ ఈ అంశాలు ప్రకటించారు. 2012 బ్యాచ్ లో 225 మంది సబ్ ఇన్స్పెక్టర్లుగా ఎంపికై విధులు నిర్వహిస్తుండగా అందులో 107 మంది ఇప్పటికే డిప్యూటేషన్ పూర్తి చేశారని, ఇటీవల 95 మంది అధికారులు డిప్యూటేషన్ పై వెళ్లారన్నారు. మరో 9 మంది అధికారులు సస్పెన్షన్ లో ఉన్నారని, సబ్ ఇన్స్పెక్టర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కనీసం ఆరు నెలల పాటు డిప్యూటేషన్ లో విధులు నిర్వహించాలని అప్పుడు పదోన్నతులు ఇస్తామని స్పష్టం చేశారు. సీనియార్టీకి ఇబ్బందులేకుండా జూనియర్ లెవరికి పదోన్నతులు ఇవ్వమని ఈ అంశంపై ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలియజేశారు.

సీఎంకు శుభాకాంక్షల వెల్లువ

## రాజకీయ ప్రస్థానంలో 20 ఏళ్లు పూర్తి..

**-ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**



హైదరాబాద్, జులై 4: ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణాన్ని అంచెలంచెలుగా విస్తరించుకుంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని అధిరోహించిన సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ జీవితంలో మరో కీలక మైలురాయి నమోదైంది. ఆయన రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మండల స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి వరకు విజయవంతంగా సాగిన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారు విడుదల చేసిన సందేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ రాజకీయ జీవితంలో ఎన్నో కీలక మైలురాళ్లు అధిగమించారని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి స్థాయి నుంచి రాష్ట్ర అత్యున్నత ప్రజాస్వామ్య బాధ్యత అయిన ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం ఆయన కృషి, పట్టుదల, నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు.

తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సుస్థిర పాలన లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని అభినందనలు తెలియజేశారు. రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానుల నుంచి సామాజిక మాధ్యమాల వేదికగా కూడా పెద్దఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## డీజిల్, పెట్రోల్‌పై ఇంధన కంపెనీలకు 75 వేల కోట్ల నష్టం: ప్రధాని మోదీ



బలోత్రా, జులై 4: పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే ఆ అంశంపై విపక్షాలు ప్రజల్ని భయాందోళలనలకు గురి చేశాయని, ప్రజల్ని తప్పుదోవ పట్టించారని ప్రధాని మోదీ అన్నారు. రాజకీయ క్రీడలు ఆడారని విమర్శించారు. కానీ చెడు ప్రయత్నాలు చేసిన వాళ్లు సక్సెస్ కాలేదన్నారు. చిన్న చిన్న అవరోధాలు తప్ప, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంధన సరఫరాలో పెద్దగా సవాళ్లు ఎదురు కాలేదని మోదీ అన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో.. వివిధ ఇంధన కంపెనీలు డీజిల్, పెట్రోల్‌పై సుమారు 75 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని అన్నారు. అయితే ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరించిందన్నారు. లీటరుపై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించినట్లు మోదీ తెలిపారు. ప్రజలపై ఎటువంటి అదనపు భారం పడకుండా చూశామన్నారు. ఇవాళ రాజస్థాన్‌లోని బలోత్రాలో పెట్రోకెమికల్ రిఫైరీని ప్రారంభించిన తర్వాత మోదీ ప్రసంగించారు.

పశ్చిమాసియా యుద్ధ సమయంలో..వివిధ దేశాలతో ఉన్న స్నేహసంబంధాలు భారత్‌కు కలిసి వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభానికి ముందు కేవలం 26 దేశాల నుంచి మాత్రమే భారత్ ఇంధనాన్ని దిగుమతి చేసుకునేదని, కానీ సంక్షోభ సమయంలో భారత్ తన దౌత్య బలాన్ని ప్రదర్శించిందని, వార్ జరుగుతున్నా.. సుమారు 40 దేశాల నుంచి భారత్ ఇంధనాన్ని దిగుమతి చేసుకున్నట్లు చెప్పారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే కీలకమన్న విషయాన్ని ప్రభుత్వం చాటి చెప్పిందన్నారు. తీవ్రమైన ఇంధన సంక్షోభం ఉన్నా.. అమితమైన అనుభవం వల్ల ఆ సంక్షోభం నుంచి బయట పడినట్లు ఆయన చెప్పారు.గత దశాబ్ధ కాలం నుంచి విజయవంతమైన విధానాల అమలు ద్వారా ఆ సంక్షోభ పరిస్థితి నుంచి గట్టెక్కినట్లు ఆయన తెలిపారు.

## రెండు రోజులపాటు అత్యంత భారీ వర్షాల హెచ్చరిక

**శని, ఆదివారాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం**
**థానే, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాలకూ వాతావరణ శాఖ హెచ్చరికలు**

ముంబై,జులై 4: దేశ ఆర్థిక రాజధాని ముంబైపై మరోసారి భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. శని, ఆదివారాల్లో నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ఇప్పటికే పలురోజులుగా కురుస్తున్న వర్షాలతో నగరంలో జనజీవనం తీవ్రంగా దెబ్బతినగా, రాబోయే రెండు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ముంబైలో వర్షాలు మరోసారి ఉద్ధృతం కానున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శని, ఆదివారాలకు నగరానికి 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. ఈ రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఏడాది రుతుపవనాల రాక కొంత ఆలస్యమైనప్పటికీ, గత కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో ముంబైలోని పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

భారీ వర్షాలు, నీరు నిల్వ ఉండటంతో నలసోపారా-విరార్ మధ్య రైల్వే ట్రాక్‌లపై ప్రభావం పడింది. దీంతో వెస్ట్రన్ రైల్వే సబర్బన్ లోకల్ రైలు సర్వీసులు సుమారు 15 నుంచి 20 నిమిషాల వరకు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ప్రయాణానికి ముందు రైళ్ల సమయాలను తెలుసుకోవాలని సూచించారు.

ఐఎండీ జిల్లా వారీ అంచనాల ప్రకారం, జూలై 4, 5 తేదీల్లో ముంబైలో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం 'చాలా ఎక్కువ' (వెరీ లైక్లీ)గా పేర్కొంది. అంతేకాకుండా సోమవారం కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని, మంగళవారం కూడా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

**పరిసర జిల్లాలకూ హెచ్చరికలు**

ముంబైతో పాటు పొరుగున ఉన్న థానే, పాల్ఘర్ జిల్లాలకు కూడా శని, ఆదివారాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో కూడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే రాయ్‌గఢ్ జిల్లాకు శుక్రవారం, శనివారాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. అక్కడ కూడా కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

## ట్రిపుల్ ఐటీలో కలకలం

హైదరాబాద్, జులై 4: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో విషాద ఘటన చోటుచేసుకుంది. కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థి అనిరుధ్ క్యాంపస్‌లోని భవనం ఆరో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన అనిరుధ్‌గా గుర్తించారు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు క్యాంపస్‌కు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అనిరుధ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కుటుంబ సభ్యులు, సహ విద్యార్థులను ప్రశ్నిస్తూ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఘటనతో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో విషాద వాతావరణం నెలకొంది.

## తెలంగాణ-విక్టోరియా మధ్య కొత్త భాగస్వామ్యం..

**-మంత్రి శ్రీధర్‌బాబుతో విక్టోరియా శాసనమండలి ప్రభుత్వ విప్ లీ టార్లామిస్ భేటీ**



హైదరాబాద్, జులై 4: తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంతో వాణిజ్యం, సాంకేతికత, విద్య, స్టార్టప్‌లు వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి.

ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్ లీ టార్లామిస్ శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ-విక్టోరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు.

సమావేశంలో ముఖ్యంగా ఆధునిక సాంకేతికతలు, స్టార్టప్‌ల అభివృద్ధి, విద్యా రంగం, గేమింగ్ పరిశ్రమ, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పెట్టుబడుల అవకాశాలు వంటి అంశాలపై పరస్పర సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. ఇరు ప్రాంతాల మధ్య పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆవిష్కర్తలు కలిసి పనిచేసే అవకాశాలను కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పారదర్శక పారిశ్రామిక విధానాలు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణంతో రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, డేటా కేంద్రాలు, గేమింగ్, యానిమేషన్, జీవశాస్త్ర సాంకేతికత, స్టార్టప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు.

విక్టోరియా రాష్ట్రానికి చెందిన సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు, అలాగే తెలంగాణకు చెందిన సంస్థలు విక్టోరియాతో భాగస్వామ్యాలు ఏర్పరచుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. లీ టార్లామిస్ కూడా తెలంగాణలో ఐటీ, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధి వేగంగా జరుగుతున్న తీరును ప్రశంసించారు. భవిష్యత్తులో వాణిజ్యం, సాంకేతికత, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో రెండు ప్రాంతాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ భేటీ తెలంగాణ-విక్టోరియా మధ్య ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక భాగస్వామ్యానికి కొత్త అవకాశాలను తెరచే దిశగా కీలకంగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## వైభవంగా వేంకటేశ్వరుని నిత్య కళ్యాణం

యాదాద్రి, జులై 4: యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్వర్ణగిరి క్షేత్రంలో శనివారం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను నిర్వహించారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకు వచ్చారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు.

మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హావనంను నిర్వహించారు. శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయమానంగా నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5 వేల మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఎల్కతుర్తిలో మంత్రి పొన్నం పర్యటన ..



హన్మకొండ, జులై 4:తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి కూడా నిధులతో మంజూరైన ఎల్కతుర్తి-మడిపల్లి రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

# వృత్తి ప్రధానమే కాని వ్యక్తిగత జీవితం కూడా ముఖ్యమే !

## (05 జూలై "జాతీయ వర్క్‌హాలిక్స్ దినం" సందర్భంగా)

కొందరు వృత్తి సంబంధ పనుల్లో తనమునకలై, తమ వ్యక్తిగత పనులనే కాదు తమ కుటుంబాలను కూడా నిర్లక్ష్యం చేస్తూ పని రాక్షసులుగా పిలువబడుతూనే అనేక ఇతర సమస్యలను కూడా ఎదుర్కొంటారు. ఇలాంటి అతిగా పని చేసే వారిని మనం సాధారణంగా పని రాక్షసులుగా పిలుస్తాం. అధిక సమయం వృత్తి లేదా ఉద్యోగ ఉపాధులకే కేటాయిస్తూ, తమను తాము మరిచిపోయి పలు అనారోగ్య సమస్యలకు కూడా లోనవుతున్నారు. వీరిని 'వర్క్‌హాలిక్స్' అని పిలవడం పరిపాటిగా మారింది. 'వర్క్', 'ఆల్కహాల్' అను పదాల కలయికతో ఏర్పడిన 'వర్క్‌హాలిక్స్' గుణం కలిగి ఉన్న వ్యక్తులు వృత్తి ఉద్యోగ ఉపాధుల పనిల్లో మాత్రమే మునిగిపోయి తనను తాను మరిచి పోయి, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి, తమ వ్యక్తిగత జీవితాలకు సహితం దూరమై తమ తమ జీవితాలను దుర్భరంగా మార్చుకుంటూ, అనారోగ్యాల బారిన పడడం చూస్తున్నాం. వృత్తికి సంబంధించిన పనులను చేయాలి కాని వ్యక్తిగత జీవితానికి, కుటుంబ సభ్యులకు కూడా తగిన సమయం కూడా కేటాయిస్తూ సమతుల్యతలను సాధించడమే అసలైన జీవన మాధుర్యమని తెలుసుకోవాలి.

జాతీయ వర్క్‌హాలిక్స్ దినం-2026 ఇతివృత్తం :

పనికి అనవసర అధిక సమయాలను కేటాయించడం, పని గంటలను మరిచి పనిలో మునిగి పోవడం లాంటి గుణాలు తమ జీవితాలను దుఃఖముతో చేస్తాయని అవగాహన పర్చడానికి ప్రతి ఏట 05 జూలైన ప్రపంచ దేశాలు "జాతీయ వర్క్‌హాలిక్స్ దినం" లేదా "జాతీయ అతిగా పని చేసే వారి దినం"గా పాటిస్తారు. 2026 జాతీయ వర్క్‌హాలిక్స్ దినోత్సవం ఇతివృత్తంగా "పనితో పాటు వ్యక్తిగత జీవితం సమతుల్యత అవగాహన" అనబడే అంశం తీసుకుని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తులు తమకు కేటాయించిన సమయంలో మాత్రమే పని చేస్తూ, వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలకు తగు సమయాన్ని కేటాయిస్తూ జీవితంలో పనికి, ఇతర అంశాలకు సమతుల్యత సాధిస్తూ, సంతోష ఆరోగ్యకర జీవితాలను గడపడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాలి. మన పనులను ప్రాధాన్యతాక్రమంలో నిర్ణయించుకొని అన్నింటికీ తగిన సమయం కేటాయించాలి. మనం వృత్తి పనులు చేయడానికి మాత్రమే కాదని గమనించాలి.

ఓవర్ టైమ్ పనిలోనే మునిగితే జరిగే అనర్థాలు:

మనకంటూ ఒక వ్యక్తిగత జీవితం ఉంది. మనకు కూడా అభిరుచులు ఉంటాయి. మనకు కూడా అందరితో కలిసి ఆనందంగా జీవించాలని ఉంటుంది. అభిరుచులను తీర్చుకోవాలని ఉంటుంది. మన కుటుంబాన్ని, సంతానాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలని కూడా ఉంటుంది. జీవనోపాధికి ఏదో ఒక వృత్తిని ఎంచుకుంటాం. దాని నుంచి లభించే జీతంతో మనదైన జీవితాలను గడుపుతాం. జీతం మాత్రమే జీవితం కాదని తెలుసుకోవాలి. వృత్తి పనుల్లో అధిక సమయం కేటాయించడం ఉత్తమం కాదు. మనకు కేటాయించిన దాదాపు 8 గంటల సమయంలో మాత్రమే ఏకాగ్రతతో పని చేయాలి, ఉత్తమ ఫలితాలను సాధించాలి. అధిక సమయం పని చేస్తే ఏకాగ్రత లోపించి తక్కువ ఫలితాలు లేదా ఎక్కువ తప్పులు జరుగుతాయి. దీనితో మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ, నిద్రలేమి, అలసట, తలనొప్పి లాంటివి ఆవహిస్తాయి. అనారోగ్యం మనల్ని ఆక్రమిస్తుంది. ఓవర్ వర్క్ మనశ్శాంతిని హరిస్తుంది. సంస్థలో చెడ్డ పేరు తెస్తుంది.

మనం వృత్తిలో పని గంటలను పాటిద్దాం. సహచర ఉద్యోగులతో సరదాగా కలిసి పని చేద్దాం, పనితో ఏకాగ్రతను పెంచుకుంటూ సాఫల్యత సాదిద్దాం. సమయానుకూలంగా కుటుంబంతో కలిసి వినోదాలు, విందులు, యాత్రలకు ప్రణాళికలు వేద్దాం. జీవితాన్ని సమతుల్యతతో సంతోషాలు నిండిన మహాభాగ్యంగా మలుచుకుందాం. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని తెలుసుకుందాం. ఆరోగ్యానికి కొంత సమయాన్ని పెట్టుబడిగా పెడదాం. ఆరోగ్యం ఉంటేనే వృత్తి ఉద్యోగాలని తెలుసుకుందాం. వర్క్-లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటూ ఆనంద సుగంధాలతో జీవితాలను కొనసాగిద్దాం. అందరూ మెచ్చే విధంగా జీవనశైలినా మార్చుకుందాం.



-మధుపాలీ
9949700037

# ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధానమంత్రి పర్యటన

న్యూ ఢిల్లీ, జులై 4:ఇండోనేషియా అధ్యక్షులు శ్రీ ప్రబోవో సుబియాంటో ఆహ్వానం మేరకు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 జూలై 6 నుంచి 8 వరకు ఇండోనేషియాలో పర్యటించనున్నారు. వే 2018లో భారత్-ఇండోనేషియా సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదిగిన తర్వాత, ప్రధానమంత్రి ఇండోనేషియాలో పర్యటించడం ఇది నాలుగోసారి కాగా... ఇది ఆయన తొలి ద్వైపాక్షిక పర్యటన. ఈ పర్యటన సందర్భంగా, ఇండేనేషియా అధ్యక్షులు శ్రీ ప్రబోవోతో ప్రధానమంత్రి ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. ఇరు దేశాల భాగస్వామ్యంలో సాధించిన పురోగతిని సమీక్షిస్తారు. జకార్తాలో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసే భారీ సభనుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. భారత్, ఇండోనేషియా దేశాల ప్రజల మధ్య చరిత్రాత్మక, ఆత్మీయ సంబంధాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రత్యేక సంబంధాలకు అనుగుణంగా... ఇండోనేషియాలోని ప్రముఖ యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన యెాగ్యకార్తాలోని ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని ప్రధానమంత్రి సందర్శిస్తారు.

ఆస్ట్రేలియా ప్రధానమంత్రి, గౌరవ ఆంథోనీ అల్బనీస్ ఎంపీ ఆహ్వానం మేరకు, ప్రధానమంత్రి 2026 జులై 8-10 తేదీల్లో మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఇండోనేషియా నుంచి ప్రధానమంత్రి నేరుగా మెల్‌బోర్న్ చేరుకుని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్, గౌరవ సామ్ మోస్టిన్ ఏసీతో ప్రధానమంత్రి సమావేశమవుతారు. భారత్-ఆస్ట్రేలియా సీఈఓల సదస్సులోనూ ప్రధానమంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరు దేశాల అగ్రశ్రేణి వ్యాపార నాయకుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. భారత్-ఆస్ట్రేలియా సంబంధాలకు మూలస్తంభంగా నిలుస్తున్న ప్రవాస భారతీయుల భారీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

న్యూజిలాండ్ ప్రధానమంత్రి గౌరవ క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు, భారత ప్రధానమంత్రి 2026 జులై 10-11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటిస్తారు. గత నాలుగు దశాబ్దాల్లో న్యూజిలాండ్‌లో భారత ప్రధానమంత్రి తొలి అధికారిక పర్యటన ఇదే కానుంది. మెల్‌బోర్న్ నుంచి ప్రధానమంత్రి నేరుగా ఆక్లాండ్ చేరుకుంటారు. ఆక్లాండ్‌లో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్‌తో ద్వైపాక్షిక చర్చల్లో ప్రధానమంత్రి పాల్గొంటారు. గత రెండేళ్లలో వాణిజ్యం, రక్షణ వంటి రంగాల్లో గణనీయ పురోగతిని సాధించిన ద్వైపాక్షిక సంబంధాల సమగ్ర అంశాలను సమీక్షిస్తారు. ఆక్లాండ్ పర్యటనలో భాగంగా, ప్రముఖ వ్యాపార, క్రీడా రంగాల ప్రముఖులతోనూ ప్రధానమంత్రి సమావేశమవుతారు. భారత్-న్యూజిలాండ్ ప్రజల మధ్య ఉన్న బలమైన సంబంధాలకు నిదర్శనంగా, అక్కడి ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసే భారీ సభనుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

# అవనిగడ్డలో ఘనంగా వంగవీటి మోహనరంగా 79వ జయంతి



అమరావతి, జులై 4: స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలను అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రంగా చిత్రపటానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, జనసేన నాయకుడు చిలకలపూడి పాపారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

వక్తలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన వంగవీటి మోహనరంగా సేవలను స్మరించుకున్నారు. సమాజ సేవలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన యాసం చిట్టిబాబును రాజకీయ ప్రముఖులు అభినందించారు.






# ఏటేటా అవస్థలు పడుతున్న గిరిజన గ్రామాల ప్రజలు



ఆదిలాబాద్, జులై 4:రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు మంజూరు చేస్తామని ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరుస్తామని ప్రజా ప్రతినిధులు ప్రతి ఎన్నికల్లో హామీలు ఇస్తున్నారు తప్ప రోడ్ల నిర్మాణ విషయంలో పట్టించుకోవడంలేదని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండలంలోని మారుమూల గ్రామపంచాయతీ అయినా చింత కర్ర పంచాయతీకి 2017 -18 లో పి ఎం జి ఎస్ వై పథకం కింద కెరమెరి ఘాట్ ప్రాంతం నుండి కిషన్ నాయక్ తండ వరకు 8 కిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేశారు.

ఆ రోడ్డు పనులకు టెండర్లు కూడా జరిగి రోడ్డు పనులను అప్పటి ఎమ్మెల్యే కోవలక్ష్మి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించిన రోజే అటవీ శాఖ అనుమతులు లేవని అటవీ అధికారులు ఆ రోడ్డుపనులను అడ్డుకొని నిలిపివేశారు. ఆ రోడ్డు నిర్మాణానికి దాదాపు ఆరు సంవత్సరాలు కావడంతో మంజూరైన బి టి రోడ్డు నిధులు రద్దు అయ్యాయని తెలిసింది. చింత కర్ర పంచాయతీలోని చింతకర్ర తాటి కూడా కిషన్ నాయక్ తండ మూడు గిరిజన గ్రామాలకు మట్టి రోడ్డు ఉండడంతో వర్షాకాలంలో గుంతలు ఏర్పడి అద్వానంగా మారడంతో ఆ రోడ్డుపై ఆ గ్రామాల గిరిజనులు ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు.

ప్రస్తుతం మట్టి రోడ్డు ఉండడంతో వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడి బురుదమయంగా మారడంతో వాహనాలు సరిగా ఎలక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆ మూడు గిరిజన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ అనుమతులు తీసుకోక పోవడం వల్లనే ఆ గ్రామాలకు మంజూరైన బీటీ రోడ్డు వేయలేకపోయారని ఆయా గ్రామాల పెద్దలు నాయక్ లు పేర్కొంటున్నారు. ఆ గ్రామాలు ఏర్పడి ఏండ్లు గడుస్తున్న రోడ్డు సరిగా లేక ప్రతి ఏడాది వర్షాకాలంలో నాలుగు నెలలు అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆ మూడు గ్రామాల గిరిజన ప్రజలు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

ప్రతి ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు నాయకులు ప్రచారానికి వచ్చినప్పుడల్లా మీ గ్రామాలకు ప్రధాన సమస్య రోడ్డు ఉందని దాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని హామీలు ఇనస్తా ఎన్నికల్లో గెలిచిన తర్వాత విస్మరిస్తున్నారని ఆయా గ్రామాల గిరిజన నాయకులు గిరిజనులు పేర్కొంటున్నారు. మా పంచాయతీకి రోడ్డు నిర్మాణం జరిగేటప్పుడు ఇబ్బందులు తప్పేది ఎప్పుడు అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు అత్యవసర పరిస్థితిలో తలెత్తినప్పుడు వాహనాలు వెళ్ళక దాదాపు 8 కిలోమీటర్లు కాలినడకన వచ్చి మండల కేంద్రానికి రావాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇబ్బందులు తొలిగేలా నూతన బీటీ రోడ్డు నిర్మించాలని ఆ మూడు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

చింత కర్ర పంచాయతీలోని చింతకర తాటి కూడా కిషన్ నాయక్ తండ గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం జరిగేలా కృషి చేస్తానని చింతకర్ర పంచాయితీ నూతన సర్పంచ్ జాదవ్ విట్టల్ పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి మట్టి రోడ్డు ఉండడంతో వర్షాకాలంలో బురదమయంగా గుంతల మయంగా ఏర్పడి పంచాయతీలోని మూడు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్ని ప్రజాప్రతిని దృష్టికి తీసుకువెళ్ళి తన హాయంలో రోడ్డు నిర్మించేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేలు ఎంపీలు ఉన్నత అధికారులు తమ మారుమూల గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలిగేలా బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఆయన కోరారు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని తమ ఇబ్బందులను గమనించి రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు కోరారు. ఈ రోడ్డు విషయంలో ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లేలా కృషి చేస్తానని చింత కర్ర సర్పంచ్ జాదవ్ విట్టల్ పేర్కొన్నారు. తమ పంచాయతీలోని గ్రామాలకు ప్రధాన సమస్య రోడ్డు ఉందని త్రాగునీరు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుటకు రోడ్డు సరిగా లేక వాహనాలు నడవక ఇబ్బందులు అవుతున్నాయని సర్పంచ్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం 108 వాహనాలు కూడా తమ గ్రామాలకు రాలేకపోతున్నాయని దీంతో వైద్య సేవలు పరంగా కూడా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# వర్షాకాల వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరం



ఆదిలాబాద్, జులై 4:: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం గూడమామడ గ్రామంలో శనివారం వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆశా వర్కర్ల ద్వారా ఆరోగ్య అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని గ్రామ సర్పంచ్ కుమ్ర యశోద కేశవరావు సూచించారు.

డ్రైడే కార్యక్రమంలో భాగంగా వర్షం కురుస్తున్నప్పటికీ సర్పంచ్ కుమ్ర యశోద కేశవరావు వైద్య సిబ్బందితో కలిసి గొడుగులు పట్టుకుని ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ, వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

ఇళ్లలో నీటిని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచకూడదని, అలా ఉంచితే దోమల లార్వా పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. ఇల్లు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కరాడే శివాజీ, హెల్త్ అసిస్టెంట్ పెందూర్ భరత్, ఏఎన్ఎం సేవంత, అంగన్‌వాడీ టీచర్ కుడుమేత బిజులబాయి, సీహెచ్‌డబ్ల్యూ, ఆశా వర్కర్ కుమ్ర లింగాదేవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్‌జీరో విధానం

అమరావతి, జులై 4: చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని నలగంపల్లి గ్రామంలో అమలు చేస్తున్న నెట్‌జీరో విధానాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కుప్పం పర్యటన రెండో రోజు శనివారం నలగంపల్లి గ్రామాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి, నెట్‌జీరో విధానాన్ని అమలు చేస్తున్న ఇళ్లను పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న పర్యావరణహిత కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. నలగంపల్లి నమూనాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం నియోజకవర్గం అంతటా విస్తరించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

గ్రామంలో పర్యటించిన ముఖ్యమంత్రి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ విధానాలు, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్ వంటి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి ఇంటిలో పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ పొదుపు, వ్యర్థాల నిర్వహణ, స్వయం సమృద్ధి లక్ష్యంగా చేపడుతున్న చర్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలోని ఓ ఇంటిని సందర్శించిన సీఎం సోలార్ ప్యానెళ్ల సామర్థ్యం, రోజువారీ విద్యుత్ ఉత్పత్తి, కుటుంబ అవసరాలకు సరిపోతున్న విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను వినియోగించడం వల్ల నెలకు సుమారు రూ.400 వరకు విద్యుత్, ఇంధన వ్యయంలో ఆదా అవుతోందని లబ్ధిదారులు తెలిపారు. వర్షపు నీటి సంరక్షణ, వంటింటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ, ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయల సాగు వంటి అంశాలను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా పరిశీలించారు.

నెట్‌జీరో విధానంలో భాగంగా విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని కూడా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రామస్థాయిలో సర్క్యులర్ ఎకానమీ విధానాన్ని అమలు చేస్తే వ్యర్థాలను సంపదగా మార్చుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నలగంపల్లి అమలు చేస్తున్న విధానం రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా ఇండక్షన్ స్టవ్‌ల వినియోగంపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రస్తుతం అన్ని రకాల వంటలు ఇండక్షన్‌పై సులభంగా చేసుకునే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

# జైపూర్ మెట్రో రైలు ప్రాజెక్టు 2వ దశకు శంకుస్థాపన

న్యూఢిల్లీ, జులై 4:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 జులై 4న రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఉదయం సుమారు 10:45 గంటలకు జోధ్‌పూర్ విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, సవరించిన ఉడాన్ పథకాన్ని కూడా ఆయన ప్రారంభిస్తారు. ఆ తరువాత మధ్యాహ్నం దాదాపు 12:15 గంటలకు, ఆయన బలోతరాకు వెళ్తారు. అక్కడ దాదాపు రూ.1.06 లక్షల కోట్ల ఖర్చుతో నిర్మాణం పూర్తి అయిన అభివృద్ధి ప్రాజెక్టులను దేశ ప్రజలకు అంకితం చేయడం, ప్రారంభించడంతో పాటు కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

దీని తరువాత, ప్రధానమంత్రి గుజరాత్ వెళ్తారు. సాయంత్రం దాదాపు 4:30 గంటలకు, అహ్మదాబాద్.. సాణంద్‌లో సీజీ సెమీ అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ప్రధాని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

జోధ్‌పూర్‌లో ప్రధానమంత్రి

ప్రాంతీయ అనుసంధానంపై ప్రధానంగా దృష్టిని సారిస్తూ విమానయాన రంగానికి పెద్ద దన్నుగా తీర్చిదిద్దిన 'ఉడాన్' (ఐఅంఐ) పథకాన్ని జోధ్‌పూర్‌లో ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఇది భారత పౌర విమానయాన రంగంలో ఓ కీలక మలుపు అని చెప్పవచ్చు. అంతేకాదు, ఇది "ఉడే దేశ్ కీ ఆమ్ నాగరిక్" (దేశంలో సామాన్య పౌరులు కూడా విమాన ప్రయాణాలు చేయాలి) అనే దృష్టికోణాన్ని మరింత ముందుకు తీసుకుపోనుంది. రాబోయే 10 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని రూ.28,840 కోట్లను ఈ పథకానికి కేటాయించారు. విమానయాన ఆధారిత అభివృద్ధిలో తదుపరి దశను వేగిరపరచడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకాన్ని సమగ్ర, సుస్థిర అనుసంధానాన్ని నిర్ధారించడానికి రూపొందించారు.

దేశమంతటా విమానయాన మౌలిక సదుపాయాలను విస్తరించడానికి, ప్రస్తుతం ఉపయోగించకుండా ఉన్న ఎయిర్ స్ట్రిప్‌లను 100 ఏరోడ్రోమ్‌లుగా మార్చడంపై దృష్టి సారిస్తారు. దీనికి రూ.12,000 కోట్ల కన్నా ఎక్కువ బడ్జెటును కేటాయించారు. దీనికి అదనంగా, ప్రాంతీయ విమానాశ్రయ కార్యకలాపాలను మొదలుపెట్టిన కొన్ని సంవత్సరాల్లోనే వాటి లాభదాయకతను నిర్ధారించడానికి ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎమ్)కు రూ.2,500 కోట్ల కన్నా ఎక్కువ మొత్తాన్ని కేటాయించారు. ఈ పథకంలో భాగంగా దూర, కఠిన ప్రాంతాలకు చేరుకోవడానికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడానికి 200 ఆధునిక హెలీప్యాడ్లను అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన కూడా ఉంది.

విమానయాన సంస్థలకు రూ.10,000 కోట్ల కన్నా ఎక్కువ విలువైన వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) సహాయాన్ని ఈ పథకంలో భాగంగా అందిస్తున్నారు. దీంతో ప్రాంతీయ కార్యకలాపాలు నిరంతరాయంగా సాగేందుకు అవకాశం ఉంటుంది. క్రమ క్రమంగా వాణిజ్య లాభదాయకత పుంజుకొనేందుకు కూడా ఆస్కారం ఉంటుంది. 'ఆత్మనిర్భర్ భారత్' దృష్టికోణానికి మరింత బలాన్ని అందిస్తూ, హెచ్ఏఎల్ ధ్రువ్, డార్నియర్ ప్లాట్‌ఫారాల వంటి స్వదేశీ విమానాలూ, హెలీకాప్టర్ల సేకరణను కూడా ఈ కార్యక్రమంలో చేర్చారు. సేవలు తక్కువగా అందుబాటులో ఉన్న ప్రాంతాలకు అనుసంధానం, నిర్వహణ కార్యకలాపాలను పెంచడం దీని ముఖ్యోద్దేశం.

ఈ కార్యక్రమంలో భాగంగా, జోధ్‌పూర్ విమానాశ్రయ కొత్త టెర్మినల్ భవనాన్ని కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టును మొత్తం రూ.480 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేశారు. 23,000 కన్నా ఎక్కువ చ.కి.మీ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ నూతన టెర్మినల్ భవనం ఏటా 20 లక్షల మంది ప్రయాణికులకు సేవలను అందిస్తుంది. ప్రయాణికులు నిరంతరాయంగా, హాయిగా ప్రయాణించడానికి అనువైన అనేక సౌకర్యాలను ఈ భవనంలో ఏర్పాటు చేశారు.

రాజస్థానుకు చెందిన రాచఠీవి ఉట్టిపడే వాస్తుకళ నుంచి స్ఫూర్తిని పొందుతూ, అదే సమయంలో సమకాలిక డిజైన్లను కూడా మేళవించి ఈ టెర్మినల్ కమాన్లనూ, కిటికీలనూ తీర్చిదిద్దారు. ఇంధనాన్ని ఆదా చేసే వ్యవస్థలనూ, నీటి సంరక్షణ చర్యలనూ, హరిత భవన నిర్మాణ పద్ధతులనూ అనుసరించి సుస్థిరాభివృద్ధిని వెన్నుదన్నుగా తీసుకుని, 5 నక్షత్రాల 'గృహ' (ఉఖీఏఊం) రేటింగును దక్కించుకొనే లక్ష్యంతో ఈ టెర్మినల్‌ను డిజైన్ చేశారు. జోధ్‌పూర్ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభించిన తరువాత, ఈ ప్రాంతంలో పర్యటన, వాణిజ్యం, ఉపాధి అవకాశాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించనుంది.

బాలోతరాలో ప్రధానమంత్రి

సుమారు రూ.1.06 లక్షల కోట్ల ఖర్చుతో బాలోతరాలో చేపట్టే వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. నిర్మాణం పూర్తి అయిన కొన్ని ప్రాజెక్టులను ఆయన ప్రారంభిస్తారు. వీటిలో పెట్రోరసాయనాలు, పట్టణ రవాణా, రైల్వేలు, రోడ్లు, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్తు సరఫరా వంటి అనేక రంగాలకు చెందిన ప్రాజెక్టులున్నాయి.

బాలోతరా.. పచ్‌పద్‌రాలో భారత తొలి గ్రీన్‌ఫీల్డ్ ఏకీకృత రిఫైనరీ, పెట్రోరసాయనిక కాంప్లెక్సును దేశ ప్రజలకు ప్రధాని అంకితం చేస్తారు. ఇది దేశంలో ఇంధనం, పెట్రోరసాయనాల రంగంలో ఒక కీలక ప్రగతి ప్రస్థానానికి సూచికగా నిలవనుంది.

ప్రభుత్వానికీ, హిందుస్తాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ సంస్థ (హెచ్‌పీసీఎల్)కీ మధ్య సంయుక్త సంస్థ (జేవీ)గా అభివృద్ధిపరిచిన ఈ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోరసాయనిక కాంప్లెక్సు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు (ఎమ్ఎమ్‌టీపీఏ). దీనిని రూ.79,450 కోట్ల కన్నా ఎక్కువ పెట్టుబడితో ఏర్పాటు చేశారు.

ఈ అత్యాధునిక కాంప్లెక్సు రిఫైనింగుతో పాటు పెట్రోరసాయనాల ఉత్పాదనను ఏకీకరిస్తుంది. దీనిలో ప్రతి సంవత్సరం 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎమ్ఎమ్‌టీపీఏ) ఉత్పాదనలు లభిస్తాయి. రిఫైనరీ 17.0 నెల్సన్ కాంప్లెక్సిటీ ఇండెక్సును కలిగివుంది. దీని పెట్రోకెమికల్ ఉత్పాదనలు 26 శాతాన్ని మించనున్నాయి. ఇవి సామర్థ్యం, స్థిరత్వం విషయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానూ ఉంటాయి.

ఈ ప్రాజెక్టు భారత్ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో, పెట్రోరసాయనిక రంగంలో స్వయంసమృద్ధిని పెంచడంలో, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడడంలో కీలక పాత్రను పోషిస్తుందని భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో పెట్రోరసాయనిక, ప్లాస్టిక్ పార్కు అభివృద్ధికి ఒక ముఖ్యాధారంగా నిలవనుంది. దీని రాకతో సంబంధిత పరిశ్రమలూ, అనుబంధ రంగాలకు దన్ను లభిస్తుంది. ఈ రిఫైనరీ చెప్పుకోదగ్గ ఉద్యోగావకాశాలను కూడా అందిస్తుంది. ఫలితంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికీ ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది.

జైపూర్ మెట్రో రైల్ ప్రాజెక్టు 2వ దశకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టుకు రూ.13,000 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు చేయనున్నారు. రెండో దశలో భాగంగా, ప్రహ్లాద్‌పురా నుంచి తోడీ మోడ్ వరకూ 41 కి.మీ. పొడవైన ఉత్తర-దక్షిణ మెట్రో కారిడారును అభివృద్ధి చేస్తారు. ఇది 36 స్టేషన్ల గుండా సాగుతూ సీతాపురా, విశ్వకర్మ పారిశ్రామిక ప్రాంతానికి (వీకేఐ) చెందిన పారిశ్రామిక ప్రాంతాలనూ, నివాస ప్రాంతాలను కలుపుతుంది. ఈ కారిడార్ సీతాపురా పారిశ్రామిక ప్రాంతం, వీకేఐ, జైపూర్ విమానాశ్రయం, టోంక్ రోడ్డు, ఎస్ఎమ్ఎస్ ఆస్పత్రి, ఎస్ఎమ్ఎస్ స్టేడియమ్, అంబాబాడీ, విద్యాధర్‌నగర్ సహా ప్రధాన స్థానాలను ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా జోడిస్తుంది. ఈ ప్రాజెక్టు జైపూర్‌లో ప్రధాన పారిశ్రామిక, నివాస ప్రాంతాలకు అనుసంధానాన్ని చెప్పుకోదగిన రీతిలో మెరుగుపరుస్తుంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు వేగవంతమైన, సురక్షిత, మరింత సౌకర్యవంత ప్రజా రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది. ఒకటో దశలో 11 స్టేషన్లతో 11.64 కి.మీ. పొడవైన మెట్రో కారిడార్ ఇప్పటికే సేవలను అందిస్తోంది.

దాదాపు రూ.900 కోట్ల ఖర్చుతో నిర్మాణం పూర్తి చేసిన చురు-సాదుల్‌పూర్ (58 కి.మీ.), చురూ-రతన్‌గఢ్ (46 కి.మీ.) రైలు డబ్లింగ్ ప్రాజెక్టులను కూడా దేశ ప్రజలకు ప్రధానమంత్రి అంకితం చేస్తారు. మొత్తం 104 కి.మీ. పొడవున విస్తరించిన ఈ ప్రాజెక్టులు రాజస్థాన్ ఉత్తర-పశ్చిమ ప్రాంతాల్లో రైలు అనుసంధానాన్ని పటిష్ఠపరుస్తాయి. వీటితో రైలు మార్గాల సామర్థ్యం పెరుగుతుంది. ఫలితంగా రైళ్ల రాకపోకలూ, సరకు రవాణా రైళ్ల రాకపోకలూ సాఫీగానూ, సురక్షితంగానూ, సమయబద్ధంగానూ నడిచేందుకు ఆస్కారం ఉంటుంది. రైల్ నెట్‌వర్కులో రద్దీ తగ్గుతుంది. ఈ ప్రాజెక్టులు ఆ ప్రాంతంలో పెట్టుబడి, ఉద్యోగావకాశాల కల్పనతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కూడా నూతనోత్తేజాన్ని అందిస్తాయి.

జోధ్‌పూర్ రింగ్ రోడ్డులో 2వ సెక్షను (కార్వార్-డాంగియావాస్)లో నెలకొన్న ఎన్‌హెచ్-125ఏను నాలుగు దోవలు కలిగిందిగా విస్తరించారు. దీనిని ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. సుమారు రూ.740 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టుతో జోధ్‌పూర్ చుట్టుపక్కల ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడి, ప్రయాణాలు సాఫీగానూ, సురక్షితంగానూ మారతాయి.

దీనికి అదనంగా, ఎస్‌జేవీఎన్ కు చెందిన 1,000 మెగావాట్ల బీకానేర్ సౌర ఇంధన ప్రాజెక్టును దేశ ప్రజలకు ప్రధానమంత్రి అంకితం చేస్తారు. దీనిని దాదాపు రూ.5,500 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేశారు. దేశీయంగా నిర్మించిన 24.22 లక్షల సౌర మాడ్యూళ్లను ఈ ప్రాజెక్టులో ఉపయోగించారు. ఎన్‌హెచ్‌పీసీకి చెందిన 300 మెగావాట్ల కర్ణిసర్ బీకానేర్ సౌర ఇంధన ప్లాంటును కూడా దేశ ప్రజలకు ప్రధానమంత్రి అంకితం చేస్తారు. దేశీయంగా నిర్మించిన దాదాపు 7.75 లక్షల సౌర పీవీ సెల్స్‌నూ, మాడ్యూళ్లనూ ఈ ప్రాజెక్టులో ఉపయోగించారు.

రాజస్థాన్ రిన్యూవబుల్ ఎనర్జీ జోన్ (ఆర్ఈజడ్) నుంచి విద్యుత్తు సరఫరా కోసం రూ.1,900 కోట్ల కన్నా ఎక్కు ఖర్చుతో నిర్మించిన ట్రాన్స్‌మిషన్ లైనును కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. రాజస్థాన్ ఆర్ఈజడ్ కోసం 530 కి.మీ. పొడవైన విద్యుత్తు సరఫరా వ్యవస్థకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఈ విద్యుత్తు సరఫరా వ్యవస్థలు రాజస్థాన్లో ఉత్పత్తి చేసిన పునరుత్పాదక ఇంధనాన్ని సరఫరా చేయడంలో సౌలభ్యంతో పాటు రాష్ట్రంలో విద్యుత్తు నిరంతరాయంగా సరఫరా కావడానికి కూడా తోడ్పడతాయి.

రాజస్థాన్ ప్రభుత్వ వివిధ విభాగాల్లో నియామకాలు పూర్తి అయిన దాదాపు 54,000 మంది యువతకు నియామక పత్రాలను ప్రధానమంత్రి అందిస్తారు. భర్తీ ప్రక్రియను ముగించుకున్న వారిలో.. విద్య, ఇంధనం, హోం, పంచాయతీ రాజ్, రవాణా, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి, ప్రణాళిక, వ్యవసాయం, సమాచార సాంకేతికతతో పాటు పరిపాలన సంస్కరణల విభాగాలకు చెందిన సిబ్బంది ఉన్నారు.

సాణంద్‌లో ప్రధానమంత్రి

గుజరాత్.. సాణంద్‌లో సీజీ సెమీ అవుట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ ప్రారంభోత్సవం భారత్ సెమీకండక్టర్ తయారీ రంగంలో ఓ ముఖ్య ప్రగతి ప్రస్థానాన్ని సూచిస్తుంది. ఈ కేంద్రంలో వాణిజ్య సరళిలో ఉత్పాదన మొదలవనుండడమే దీనికి కారణం. ఇది అంతర్జాతీయ సెమీకండక్టర్ వేల్యూ చైన్లో భారత్ స్థానాన్ని బలోపేతం చేసే దిశలో ఒక పెద్ద అడుగు కానుంది. ఈ ప్రాజెక్టు ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్)లో భాగంగా ఆమోదించిన తొలి నాలుగు ప్రాజెక్టుల్లో ఒకటి. అంతేకాక రూ.7,500 కోట్ల కన్నా ఎక్కువ పెట్టుబడితో దీనిని అభివృద్ధి చేశారు.

పూర్తి సామర్థ్యంతో పని చేయడం మొదలైతే ఈ కేంద్రం ఏటా 500 కోట్ల సెమీకండక్టర్ చిప్స్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగివుంటుంది. కృత్రిమ మేధ (ఏఐ), ఉన్నత పనితీరు కలిగిన కంప్యూటింగ్‌లలో వేగంగా చోటుచేసుకుంటున్న వృద్ధి కారణంగా మెమరీ, స్టోరేజ్ పరిష్కారాల విషయంలో పెరుగుతున్న అంతర్జాతీయ గిరాకీని తీర్చడంలో ఈ కేంద్రం సాయపడుతుంది. ఆటోమోటివ్, పారిశ్రామిక, టెలికమ్యూనికేషన్స్, 5జీ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) రంగాల వినియోగదారుల అవసరాలను ఈ ప్లాంటు తీరుస్తుంది. సీజీ సెమీ కేంద్రం వేఫర్ సార్టింగ్, అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజీ డిజైన్, వైఫల్యాల విశ్లేషణ, టెస్ట్ ప్రోగ్రామ్ డెవలప్‌మెంట్, ఉత్పాదన విశిష్టత నిర్ధారణలతో పాటు ఆధునిక రవాణా వ్యవస్థ సేవలను కూడా ఇది అందిస్తుంది.

ఈ కేంద్రం పని చేయడం మొదలయితే భారత్ ఒక విశ్వసనీయ, స్వయంసమృద్ధ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా వెలుగులోకి రావడాన్ని గురించి ప్రపంచానికి చాటి చెబుతుంది. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు దేశంలో ఒక సుదృఢ, స్వయంసమృద్ధ సాంకేతిక విస్తారిత అనుబంధ వ్యవస్థను నిర్మించాలన్న ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా కూడా నిలుస్తుంది.

# గురుకుల ఇంటర్ ప్రవేశాలకు 6న స్పాట్ కౌన్సిలింగ్

కరీంనగర్, జులై 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు మంథని, పెద్దపల్లి (బాలురు), రామగుండం, మల్లాపూర్, నంది మేడారం, గర్రెపల్లి (బాలికలు)లో మిగిలిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ సీట్లకు సోమవారం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఇప్పటికే రెండు విడతల్లో సీట్ల భర్తీ పూర్తయ్యిందని, మిగిలిన సీట్ల కోసం మంథనిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు)లో స్పాట్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అభ్యర్థుల నమోదు ప్రక్రియ నిర్వహించి, అనంతరం స్పాట్ కౌన్సిలింగ్ చేపడతామని పేర్కొన్నారు.

అర్హులైన అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు వాటి రెండు జిరాక్స్ సెట్లు, విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కౌన్సిలింగ్ కేంద్రానికి హాజరు కావాలని ఉటూరి శ్రీనాథ్ సూచించారు.

# మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శం

## -జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి



కరీంనగర్, జులై 4:మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శమని పెద్దపల్లి జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి , కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ దొడ్డి కొమురయ్య, కొణిజెటి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేల రాలిన తొలి అమరుడని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగుర వేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.

కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక శాఖ మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మర్రి చెన్నారెడ్డి కోట్ల విజయభాస్కర్ రెడ్డి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వైయస్సార్ హయాంలో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆర్థిక శాఖ తోపాటు రోడ్లు భవనాలు రవాణా శాఖ మంత్రిగా హౌసింగ్ శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా హోమ్ మినిస్టర్ వైద్య ఆరోగ్యం, విద్యాశాఖ మంత్రిగా కూడా కొంతకాలం తన సేవలు అందించారని, వైయస్సార్ హఠాన్మరణం తర్వాత ముఖ్యమంత్రిగా కొంత కాలం సేవలు అందించారని , అనంతరం తమిళనాడు గవర్నర్ గా పని చేసారన్నారు.

మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ ,బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి సురేష్ , ఎస్సీ సంక్షేమ అధికారి ఎం. రవీందర్ మైనారిటీ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు ఓజ్జల సదానందం, కార్యదర్శి వెలిశాల రాజశేఖర్, గిరి,మంచాల లక్ష్మన్, వెంకటేష్, ప్రవీణ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# కన్న కొడుకును కడతేర్చిన కసాయి తండ్రి..

ఖమ్మం, జులై 4: ఖమ్మం జిల్లా కల్లూరు లో జరిగిన సంఘటన. స్థానికుల వివరాలు ప్రకారం?. పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన కొత్తపల్లి సీతారాములు ఆటో డ్రైవర్? శుక్రవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో మద్యం మత్తులో తన ఒక్కగానొక్క కుమారుడు కొత్తపల్లి కిరణ్ కుమార్(30) ను దగ్గరలోని బెల్ట్ షాపుకు తీసుకువెళ్లి ఫుల్లుగా మద్యం తాగించి తిరిగి తన ఇంటికి తీసుకొచ్చి విసక్షణారహితంగా కొట్టి, తల వెనక భాగంపై బలమైన గాయం చేయడంతో విపరీతమైన రక్తస్రావంతో కిరణ్ కుమార్ కుప్పకూలిపోయాడు. కిరణ్ చనిపోయాడని నిర్ధారించుకున్న తండ్రి సీతారాములు తన ఆటోలో పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి హంతకుడిని గాలిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# ఆంధ్రప్రదేశ్ మామిడి రంగాన్ని బలోపేతం చేసేందుకు సమగ్ర కార్యాచరణకు శ్రీకారం చుట్టిన శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్...

న్యూఢిల్లీ, జులై 4:ఆంధ్రప్రదేశ్‌లోని తోతాపురి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను క్షుణ్ణంగా పరిశీలించేందుకు, ఈ రంగం దీర్ఘకాలిక అభివృద్ధికి తగిన చర్యలను సిఫార్సు చేసేందుకు భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. కేంద్ర మంత్రి ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన సందర్భంగా తోతాపురి మామిడి రైతులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడారు. ఈ పర్యటనలో వ్యక్తమైన రైతుల ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటూ ఆయన ఈ నిర్ణయం తీసుకు న్నారు. మంత్రితో జరిగిన ఈ చర్చల సందర్భంగా శుద్ధి పరిశ్రమల కోసం తాము పెద్ద ఎత్తున పండించే తోతాపురి మామిడి రకం ధరలు గత కొన్ని నెలలుగా గణనీయంగా పడిపోయాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్‌లో ధరలు నిరంతరాయంగా పతనం కావడం వల్ల తమ ఆదాయాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడిందని, దీనివల్ల రాష్ట్రంలోని మామిడి పండించే రైతులంతా తీవ్ర ఆర్థిక ఒత్తిడికి, ఇబ్బందులకు గురవుతున్నారని వారు వివరించారు.

ఈ సమస్యపై తక్షణమే స్పందించిన శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్.. తోతాపురి మామిడి రంగానికి సంబంధించి సమగ్రమైన అంచనాను రూపొందించడానికి శాస్త్రవేత్తలు, సంబంధిత సంస్థల ప్రతినిధులతో కూడిన ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా ఐసీఏఆర్‌ను ఆదేశించారు. మామిడి సాగు, శుద్ధి నుంచి మొదలుకొని మార్కెటింగ్, దేశీయ వాణిజ్యం, ఎగుమతుల వరకు ఉన్న మొత్తం విలువ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. రైతులకు లాభదాయకమైన రాబడులను అందించేందుకు, ఈ రంగాన్ని సుస్థిరమైన ప్రాతిపదికన బలోపేతం చేసేందుకు అవసరమైన తగిన చర్యలను సిఫార్సు చేయాలని కమిటీని ఆదేశించారు.

లక్నోలోని ఐసీఏఆర్- సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ (కేంద్ర ఉప ఉష్ణమండల ఉద్యానవన శాఖ పరిశోధన సంస్థ) జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వుల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో తోతాపురి మామిడి రంగంపై అధ్యయనం చేయబోయే ఈ ఉన్నత స్థాయి కమిటీకి ఐసీఏఆర్-సీఐఎస్‌హెచ్ డైరెక్టర్ డాక్టర్ టీ దామోదరన్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో సభ్యులుగా బెంగళూరులోని ఐసీఏఆర్ కేంద్ర ఉప ఉష్ణమండల ఉద్యానవన శాఖ పరిశోధనా సంస్థ పండ్ల తోటల విభాగం అధిపతి డాక్టర్ ఎం. శంకరన్, లక్నో ఐసీఏఆర్- సీఐఎస్‌హెచ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ హెచ్ఎస్ సింగ్, ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం చెందిన అనంతరాజుపేట హార్టికల్చర్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ డి శ్రీనివాస రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యానవన శాఖ డైరెక్టర్ లేదా వారి ప్రతినిధి ఉంటారు. రాబోయే పది రోజుల్లోగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన తోతాపురి మామిడి సాగు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని కేంద్ర మంత్రి ఈ కమిటీని ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై సమగ్రమైన అవగాహన తెచ్చుకోవడానికి కమిటీ సభ్యులు.. రైతులు, శుద్ధి పరిశ్రమ ప్రతినిధులు, ఎగుమతిదారులు, రాష్ట్ర ఉద్యానవన శాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఈ రంగానికి సంబంధించిన ఇతర వాటాదారులతో నేరుగా ముఖాముఖి చర్చలు జరపనున్నారు.

ఈ నిపుణుల కమిటీ తోతాపురి మామిడి సాగు ప్రస్తుత స్థితిగతులు, పెట్టుబడి ఖర్చులు, రైతుల ఆదాయాలు, శుద్ధి పరిశ్రమల సామర్థ్యం- వినియోగం, డిమాండ్-సరఫరా సమీకరణాలు, దేశీయ మార్కెట్లతో పాటు ఎగుమతి మార్కెట్లలో ఇటీవలి కాలంలో ధరలు పడిపోవడానికి దారి తీసిన కారణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. అలాగే విలువ వ్యవస్థలోని వివిధ దశల్లో ఎదురవుతున్న సవాళ్లను అంచనా వేయడంతో పాటు... సామర్థ్యం, పోటీతత్వం, మార్కెట్ అందుబాటును మెరుగుపరచడానికి ఉన్న అవకాశాలను గుర్తిస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలనలు, వాటాదారుల సంప్రదింపులు, శాస్త్రీయ విశ్లేషణల ఆధారంగా ఈ కమిటీ ధరల పతనానికి గల కారణాలపై ఒక వివరణాత్మక అంచనా నివేదికను తయారు చేస్తుంది. తద్వారా ఆధారాలతో కూడిన విధానపరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వానికి మార్గం సుగమం అవుతుంది.

క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తయిన తర్వాత ఈ నిపుణుల కమిటీ తన సమగ్ర నివేదికను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రికి సమర్పించనుంది. ఈ నివేదికలో తోతాపురి మామిడి ధరల స్థిరీకరణకు తీసుకోవాల్సిన చర్యలు, విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహం, శుద్ధి, ఎగుమతి సామర్థ్యాల పెంపుదల, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు,శుద్ధి పరిశ్రమలు- ఎగుమతిదారుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై కీలక సిఫార్సులు ఉండనున్నాయి. వీటితో పాటు తోతాపురి మామిడి రంగం దీర్ఘకాలిక, సుస్థిర అభివృద్ధికి అవసరమైన విధానపరమైన చర్యలపై కూడా కమిటీ సిఫార్సులు చేయనుంది. ఈ సిఫార్సుల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సమన్వయంతో తదుపరి చర్యలు చేపడతాయి.తోతాపురి మామిడి సాగుదారుల ఆదాయాన్ని, వారి జీవనోపాధిని రక్షించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

# సమస్యలు పరిష్కరించాలని నిరసన..



కరీంనగర్, జులై 4:రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పెద్దపల్లి బస్టాండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు ముత్యం రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల డివిజన్ స్థాయి అధికారి ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేశారని కార్మికులు ఆరోపించారు. దీనికి నిరసనగా వాట్సాప్ గ్రూప్ ద్వారా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఆందోళనలో పాల్గొనేందుకు పెద్దపల్లి మండలానికి చెందిన కార్మికులు సిద్ధమైనప్పటికీ, కొందరు అధికారుల ఒత్తిడి కారణంగా వాట్సాప్‌లో పిలుపునిచ్చిన కార్మికులు హాజరు కాలేదని పేర్కొన్నారు. దీంతో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

గ్రామాల్లో మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికుల పట్ల అధికారులు సహృదయంతో వ్యవహరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులపై చర్యలు తీసుకోవడం కంటే విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని వివిధ సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు.

# ఎస్ఐఆర్ ఫారం ను పూర్తి చేసిన మాజీ మంత్రి పువ్వాడ

-ప్రతి కుటుంబం ఎస్ఐఆర్ ఫారం ప్రక్రియ పూర్తి చేయాలి

-డివిజన్‌లలో నాయకులు సహాయం అందిస్తారు.



ఖమ్మం, జులై 4:ఈరోజు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గ తమ కుటుంబ సభ్యుల ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత ఃబూ శ్రీమతి షాహీన్ కమల్ గారికి సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు , అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ గారు మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపి సంబంధిత బిఎల్ఓకు సమర్పించాలని కోరారు. ఫారాలు నింపడంలో లేదా వివరాల విషయంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే, బిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రతి డివిజన్‌లో అందుబాటులో ఉన్న బిఎల్ఎస్ సభ్యులు పూర్తి సహాయం అందిస్తారని తెలిపారు.

# బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా..



నిజామాబాద్, జులై 4: బోధన్ పట్టణ శివారులో కల్లు సేవించిన అనంతరం మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం బోధన్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

ఎడపల్లి మండలం అంబం గ్రామానికి చెందిన విట్టల్ శుక్రవారం బోధన్ శివారులోని ఓ కల్లు దుకాణంలో కల్లు సేవిస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయనను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేసి తగిన ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట బైఠాయించారు.

సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు ఆందోళనకారులతో మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# 'ఎఫ్ఐసీసీఐ మెర్సిడెస్-బెంజ్ భారత్ ఇన్నోవేషన్ - బిజినెస్ ఐడియాస్ ఛాలెంజ్ ప్రోగ్రామ్' కింద అంకుర సంస్థలకు డీపీఐఐటీ చేయూత

న్యూ ఢిల్లీ, జులై 4:'ఎఫ్ఐసీసీఐ మెర్సిడెస్-బెంజ్ భారత్ ఇన్నోవేషన్ - బిజినెస్ ఐడియాస్ ఛాలెంజ్ ప్రోగ్రామ్' కింద వీడియో అనుసంధానం ద్వారా నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) భారత అంకుర సంస్థలు, ఆవిష్కరణల వ్యవస్థ బలోపేతం పట్ల తన నిరంతర నిబద్ధతను పునరుద్ఘాటించింది.

తయారీ, సుస్థిరత, విద్య, డీకార్బనైజేషన్, ఆటోమోటివ్, ఈవీలు సహా కీలక రంగాల్లో వినూత్నమైన, విస్తరించదగిన పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్న అధిక సామర్థ్యం గల భారతీయ అంకుర సంస్థలను గుర్తించి, వాటికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం లక్ష్యంగా 'ఎఫ్ఐసీసీఐ మెర్సిడెస్-బెంజ్ భారత్ ఇన్నోవేషన్ - బిజినెస్ ఐడియాస్ ఛాలెంజ్ ప్రోగ్రామ్'ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా డీపీఐఐటీ అదనపు కార్యదర్శి శ్రీ అతీష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఫిక్కీ (ఎఫ్ఐసీసీఐ), మెర్సిడెస్-బెంజ్ ఇండియాను అభినందించారు. ఈ కార్యక్రమం నానాటికీ మెరుగవుతున్న భారత ఆవిష్కరణల వ్యవస్థ బలాన్ని, దేశంలోని యువ పారిశ్రామికవేత్తల అపారమైన సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. సకాలంలో సరైన మార్గదర్శనం, మద్దతును అందించడం ద్వారా... ఈ కార్యక్రమం జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఆవిష్కర్తలకు సాధికారత కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని సాధించడానికి, ప్రపంచ ఆవిష్కరణల రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇటువంటి సహకారాత్మక ప్రయత్నాలు చాలా అవసరమని శ్రీ అతీష్ కుమార్ సింగ్ జోడించారు.

ఎంపికైన ఏడు అంకుర సంస్థల వృద్ధిని వేగవంతం చేయడానికి, పెట్టుబడి సంసిద్ధతను మెరుగుపరచడానికి గాను... నిధులు సమకూరిన వెంటనే వాటికి నిర్మాణాత్మక మార్గదర్శనం, చేయూతను అందించే వ్యవస్థను ఈ కార్యక్రమంలో ప్రకటించారు. ఈ కార్యక్రమం కీలకమైన వ్యాపార నిర్వహణ, నియంత్రణ, ఆర్థిక, చట్టబద్ధత, పెట్టుబడి, సాంకేతిక రంగాల్లో అంకుర సంస్థలకు అవసరమైన మద్దతును అందిస్తుంది. తద్వారా అంకురసంస్థలు విస్తరించగల, పటిష్ఠమైన, ప్రపంచంతో పోటీపడగల సామర్థ్యాలను సాధించడానికి ఇది వీలు కల్పిస్తుంది.

ఈ విధాన ప్రణాళిక కింద ఎంపికైన అంకుర సంస్థలు ప్రభుత్వ నిబంధనలను, చట్టపరమైన విధులను పాటించడం... పన్ను విధానాలు, నిధుల వినియోగం... నిధుల సమీకరణ వ్యూహం... కంపెనీ మార్కెట్ విలువను అంచనా వేసే విధానాలు... పెట్టుబడిదారులతో పెట్టుబడి నిబంధనలపై చర్చించడం... డేటా గోప్యత... సైబర్ సెక్యూరిటీ... మేధో సంపత్తి పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక మార్గదర్శనం అందుకుంటాయి.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక డెమో డేలూ భాగంగా ఉంటాయి. తమ ఆవిష్కరణలు, వ్యాపార నమూనాలు, అభివృద్ధి వ్యూహాలను పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు, వ్యవస్థ సంబంధిత భాగస్వాముల ముందు ప్రదర్శించే అవకాశాన్ని ఈ డెమోలు అంకుర సంస్థలకు కల్పిస్తాయి. మార్కెట్ సంసిద్ధతను ధ్రువీకరించడానికి, వ్యూహాత్మక స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి, భాగస్వామ్యాలు-నిధుల సమీకరణకు గల అవకాశాలను పొందడంలోనూ ఇవి సహాయపడతాయి.

ఎంపికైన అంకుర సంస్థలు "సౌండింగ్ బోర్డ్ ప్రోగ్రామ్" ప్రయోజనాన్నీ పొందుతాయి. ఇది ఒక వ్యూహాత్మక మార్గదర్శన కార్యక్రమం. వారి వ్యాపార నమూనాలను మెరుగుపరచడానికి, వృద్ధి వ్యూహాలను పదును పెట్టడానికి, మార్కెట్ సంసిద్ధత-దీర్ఘకాలిక విజయం దిశగా వారి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి వారికి పరిశ్రమ సంబంధిత అవగాహనను, నిపుణుల మార్గదర్శనాన్ని, నాయకత్వ దృక్పథాలను అందించడం లక్ష్యంగా దీనిని రూపొందించారు. ఆవిష్కరణలు, కొత్త పరిశ్రమల ఏర్పాటులో ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలవాలనే భారత దార్శనికతకూ ఇది దోహదపడుతుంది.

దేశవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానించిన ఈ కార్యక్ర మంలో... దేశం నలుమూలల నుంచీ అంకుర సంస్థలు పాల్గొన్నాయి. పరిశ్రమ నిపుణులు, వ్యవస్థ భాగస్వాముల కఠినమైన బహుళ-దశల మూల్యాంకనం తర్వా త... 32 అంకురసంస్థలతో జాబితాను రూపొందించారు. జ్యూరీ, నాయకత్వ బృందం ఎదుట తమ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి ఈ అంకురసంస్థలను ఆహ్వానించారు.

# ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడుల సహకారాన్ని పెంపొందించడం కోసం ఎగుమతుల ప్రోత్సాహానికి తొలి ఇండియా - మాలి ఫోరమ్‌ను నిర్వహించిన భారత్ - మాలీ

న్యూఢిల్లీ, జులై 4:ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన చర్యగా భారత్, మాలీ దేశాలు తమ పెరుగుతున్న వాణిజ్య భాగస్వామ్యాన్ని సుస్థిరం చేస్తూ తొలి ఇండియా - మాలి ఎగుమతుల ప్రోత్సాహ ఫోరమ్‌ను నిర్వహించాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి సహకారాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ఈ వేదికను ఉద్దేశించారు.

వ్యాపార, వ్యూహాత్మక భాగస్వామ్యాల బలోపేతం అనే ఇతివృత్తంతో బామాకోలో జరిగిన ఈ రెండు రోజుల ఫోరమ్‌కు మాలీ తాత్కాలిక ప్రధాన మంత్రి మేజర్ జనరల్ అబ్దులాయ్ మైగా అధ్యక్షత వహించారు. దీనిని మాలీ పరిశ్రమల, వాణిజ్య మంత్రిత్వ శాఖ, బామాకోలోని భారత రాయబార కార్యాలయం, మాలీ ఎగుమతుల ప్రోత్సాహక సంస్థ (అపెక్స్-మాలి) సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఫోరమ్‌లో ఇరు దేశాల ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు, సుమారు 30 మంది భారతీయ వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు. భారత ప్రతినిధి బృందానికి భారత ప్రభుత్వ వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ (ఎఫ్టీ-ఆఫ్రికా) శ్రీ అమిత్ కుమార్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి మాలీలో భారత రాయబారి డాక్టర్ ఎన్. నంద కుమార్ ప్రాతినిధ్యం వహించారు.

భారత్, మాలీ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయమైన వృద్ధిని సాధించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 55 శాతం వృద్ధిని నమోదు చేసి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 326.61 మిలియన్ అమెరికన్ డాలర్లను అధిగమించింది. భారతదేశానికి మాలీ చేసే ప్రధాన ఎగుమతులలో ముడి పత్తి, ప్రాసెస్ చేసిన తోలు, జీడిపప్పు, సీసం, జిగురు, నువ్వులు ఉన్నాయి; కాగా భారతదేశం నుంచి మాలీకి ప్రధాన ఎగుమతులలో ఔషధాలు, పత్తి వస్త్రాలు, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, సైకిళ్లు ఉన్నాయి. భారతదేశానికి చెందిన డ్యూటీ-ఫ్రీ టారిఫ్ ప్రిఫరెన్స్ (డీఎఫ్టీపీ) పథకం ద్వైపాక్షిక వాణిజ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రధాన ఉత్ప్రేరకంగా నిలిచింది. మాలీ దేశపు మొత్తం ప్రపంచవ్యాప్త ఎగుమతులు సుమారు 4 బిలియన్ అమెరికన్ డాలర్లు కాగా, భారత మార్కెట్లో ఇంకా వినియోగించుకోని ఆ దేశపు ఎగుమతి అవకాశాలు దాదాపు 3.96 బిలియన్ అమెరికన్ డాలర్లుగా అంచనా. ఇది రాబోయే కాలంలో మరింత వృద్ధి సాధించడానికి ఉన్న భారీ అవకాశాలను సూచిస్తోంది.

ప్రారంభ సమావేశం అనంతరం సోనాలికా ట్రాక్టర్లు, మహీంద్రా, టాటా మోటార్స్ సంస్థలు తయారు చేసిన వాహనాలతో ఏర్పాటు చేసిన భారత్, మాలీ దేశాల ప్రదర్శన స్టాళ్లను ప్రతినిధి బృందాలు సందర్శించాయి. ఆ తర్వాత వారు బిజినెస్- టు- బిజినెస్, బిజినెస్- టు-గవర్నమెంట్, గవర్నమెంట్-టు-గవర్నమెంట్లతో కూడిన వరుస ముఖాముఖి సమావేశాలలో చురుగ్గా పాల్గొన్నారు. పునరుత్పాదక ఇంధనం, ఔషధాలు , వస్త్రాలు, ఆటోమోటివ్ తయారీ, మైనింగ్ రంగాలపై ఈ చర్చలు జరిగాయి. వ్యాపార అవకాశాలను వాణిజ్య భాగస్వామ్యాలుగానూ, అవగాహనా ఒప్పందాలుగానూ మార్చడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి.

రెండవ రోజున, భారత ప్రతినిధి బృందం మాలీ పరిశ్రమల, వాణిజ్య శాఖ మంత్రి శ్రీ మూసా అలస్సానే దియాల్లోను కలుసుకుంది. తక్షణ పెట్టుబడి అవకాశాల కోసం అపెక్స్ - మాలి సంస్థ (సిద్ధంగా ఉన్న వ్యాపార ప్రణాళికలను సమర్పించింది. ఆ తర్వాత ఈ ప్రతినిధి బృందం మాలీ తాత్కాలిక ప్రధానమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకుంది.

ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడానికి ప్రాధాన్యత రంగాలుగా పత్తి, వస్త్రాలు, మైనింగ్, ఇంధనం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమ, షియా ప్రాసెసింగ్, ఔషధాలు, ఆరోగ్యం, విద్యుత్‌తో కూడిన సామాజిక మౌలిక సదుపాయాలను ఇరుపక్షాలు గుర్తించాయి. మాలీ తన 'సర్టిఫికేట్ ఆఫ్ ఆరిజిన్' వ్యవస్థను డిజిటలైజ్ చేయడానికి భారత్ మద్దతు పట్ల, ఆమోదం పొందిన భారతీయ ఔషధ ఉత్పత్తులను త్వరితగతిన రిజిస్టర్ చేయడం పట్ల బలమైన ఆసక్తిని కనబరిచింది. షియా-నట్ ఎగుమతి నిషేధాన్ని పునఃసమీక్షించాలని భారత బృందం కోరింది, భారతీయ పౌరులు, పెట్టుబడుల రక్షణ యొక్క ప్రాముఖ్యతను కూడా పునరుద్ఘాటించింది.

ఈ ఫోరమ్ దీర్ఘకాలిక భాగస్వామ్యానికి పునాదిగా రూపొందింది.మాలీ దేశం తన 'విజన్ మాలీ 2063' ప్రణాళిక కింద వ్యాపార వాతావరణానికి భద్రత కల్పించడానికీ, పశ్చిమ ఆఫ్రికాకు ఒక వ్యూహాత్మక పెట్టుబడి కేంద్రంగా తనను తాను నిలబెట్టుకోవడానికీ నిబద్ధతను పునరుద్ఘాటించడంతో ఈ సదస్సు ముగిసింది. ఒక నిర్దిష్టమైన తదుపరి అడుగుగా, 2026 డిసెంబర్ 3,4 తేదీలలో ఒక ప్రత్యేక పెట్టుబడుల సదస్సును నిర్వహించబోతున్నట్లు మాలీ ప్రకటించింది. ఈ సదస్సులో అంతర్జాతీయ పెట్టుబడిదారుల కోసం మరిన్ని లాభదాయకమైన ప్రాజెక్టులను అందుబాటులో ఉంచనున్నారు.

# ఉప్లూర్‌కు బైపాస్ బీటీ రోడ్డు మంజూరు..

నిజామాబాద్, జులై 4: కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. గ్రామానికి రూ.5 కోట్ల 17 లక్షల వ్యయంతో బైపాస్ బీటీ రోడ్డు మంజూరు కావడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బైపాస్ రోడ్డు నిర్మాణంతో గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామ అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని తెలిపారు. ఈ రోడ్డు మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ముత్యాల సునీల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మెంబర్ బాన వేణుగోపాల్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ అధ్యక్షతన పంచాయతీ వర్గం సమావేశమై గ్రామ రహదారుల కోసం ప్రతిపాదనలు రూపొందించి, వాటిని వేణుగోపాల్ యాదవ్, సునీల్ రెడ్డిలకు అందజేసినట్లు తెలిపారు. వారి స్పందనతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏలేటి మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, ఉప సర్పంచ్ తక్కురి శేఖర్, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, కొమ్ముల రవీందర్, సుంకరి విజయ్, వార్డ్ సభ్యులు రాకేష్, సాధుల్లా, నాయకులు తక్కురి శేఖర్, క్రాంతి రెడ్డి, తిరుమలేష్, రాజేశ్వర్, నాజీర్, పురుషోత్తం, మొకిమ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలన..



నల్గొండ, జులై 4: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ నమోదు పత్రాల స్వీకరణ కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండల తహసీల్దార్ వీరాభాయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు.

గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో.. మండల సర్వేయర్, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ఇంచార్జ్ ఎం. మురళీధరన్ ఆదేశాల మేరకు మండల స్థాయి అధికారులు జీపీఓ రాములు, శైలజ, నరసింహ, దశరథ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, బీఎల్ఓ బొల్లు అండాలు, అంగన్‌వాడీ టీచర్ నల్ల జయప్రద కలిసి గ్రామ ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకుని, పత్రాలలో నమోదు చేశారు. మండల స్థాయి అధికారులు అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి విచ్చేసి, సేకరించిన ఓటర్ నమోదు పత్రాలను ఆన్‌లైన్ చేయనున్నట్లు సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ తెలిపారు. గ్రామస్థులు ఎవరైనా ఇంకా ఓటర్ నమోదు చేసుకోని వారు ఉంటే.. తప్పనిసరిగా తమ కుటుంబ సభ్యుల వివరాలు, సంబంధిత పత్రాలతో వచ్చి ఓటర్ గుర్తింపు కార్డు కోసం నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆధార్ యాప్ ద్వారా ఆధార్‌లో ఉచితంగా మెయిల్ అప్‌డేట్ సదుపాయం కల్పించిన యూఐడీఏఐ

న్యూఢిల్లీ, జులై 4:ఆధార్ కార్డు వినియోగదారుల సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచే దిశగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆధార్ కార్డులో తమ ఈమెయిల్ ఐడీని అనుసంధానించేందుకు లేదా మార్చుకోవడానికి ఇకపై ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా ఆధార్ యాప్ ద్వారా మొబైల్‌లోనే అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఈ ఉచిత సేవ కేవలం ఆధార్ యాప్ ద్వారా మాత్రమే లభిస్తుంది. 2026 జులై 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానం రాబోయే ఆరు నెలల పాటు వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. దీనివల్ల ప్రజలు తమ ఆధార్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం మునుపటి కంటే ఎంతో సులభతరం అవుతుంది. ఆధార్ కేంద్రాలకు వెళ్లే శ్రమను తప్పించడం ద్వారా వికసిత్ భారత్ లక్ష సాధన దిశగా డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు సులభమైన డిజిటల్ సేవలను అందించాలనే యూఏడీఏఐ నిబద్ధతను ఈ కార్యక్రమం చాటుచెబుతుంది.

ఆధార్ యాప్‌లో ఈ కొత్త సేవ ప్రారంభమైన కేవలం రెండు రోజుల్లోనే 2,50,000 కంటే ఎక్కువ మంది పౌరులు తమ ఈ మెయిల్లను యాప్ ద్వారా విజయవంతంగా అప్‌డేట్ చేసుకున్నారు. ఆధార్ కార్డుతో ఈమెయిల్ ఐడీని అనుసంధానించడం వల్ల ఎప్పుడైనా, ఎక్కడైనా ఆధార్ నిర్ధారణ ప్రక్రియ జరిగినప్పుడు, తక్షణమే సదరు వినియోగదారుడి ఈమెయిల్‌కు నోటిఫికేషన్ అందుతుంది.

ఇది ఆధార్ వినియోగంలో పారదర్శకతను పెంచడమే కాకుండా, తమ ఆధార్ నంబర్‌ను ఏ అవసరం కోసం ఉపయోగిస్తున్నారనే సమాచారాన్ని కార్డుదారులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలు కల్పిస్తూ, అదనపు భద్రతను అందిస్తుంది.


ప్రజల జీవన ప్రమాణాలను, సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూపొందించిన ఈ సరికొత్త ఆధార్ యాప్ ద్వారా కేవలం ఈమెయిల్ మాత్రమే కాకుండా.. మొబైల్ నంబర్ అప్‌డేట్, చిరునామా అప్‌డేట్ వంటి మరెన్నో సేవలను ప్రజలు తమ స్మార్ట్‌ఫోన్ల నుంచే నేరుగా, సులభంగా పొందుతున్నారు.

# దేవాలయాల అభివృద్ధితోనే ధర్మం, సంస్కృతి పరిరక్షణ: ఎమ్మెల్యే రాము

అమరావతి, జులై 4:దేవాలయాల అభివృద్ధి ద్వారానే ధర్మం, సంస్కృతి పరిరక్షించబడుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఆలయాల ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గుడ్లవల్లేరు మండలం వేమవరంలోని ప్రసిద్ధ శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన ఎనిమిది దుకాణాల కాంప్లెక్స్‌ను శనివారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ధర్మకర్తల కమిటీ సభ్యులు, దాతలు, భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్యక్రమానికి చేరుకున్న ఎమ్మెల్యేకు దేవాదాయ శాఖ అధికారులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించిన



దాతలను శాలువాలతో సత్కరించి అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతల సహకారంతో కొండలమ్మ ఆలయం మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. కొత్త దుకాణాల కాంప్లెక్స్ ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. ఆలయ ఆదాయం పెరగడంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, కొండలమ్మ ఆలయాన్ని రాష్ట్ర స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ధర్మకర్తలు, దాతలు, భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్ ఈడే మోహన్, ఈవో ఆకుల కొండల రావు, మండల టీడీపీ అధ్యక్షుడు పోలవరపు వెంకటరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, కార్పొరేషన్ డైరెక్టర్ సాయన పుష్పవతి, కౌతవరం బ్యాంక్ చైర్మన్ యుగంధర్, గుడ్లవల్లేరు బ్యాంక్ అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, దాతలు పాల్గొన్నారు.

## ప్రహరీ లేక వాగులోకి దూసుకెళ్లిన కారు..



వికారాబాద్, జులై 4: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురం సమీపానగల వీరన్నవాగుపై గల బ్రిడ్జికి ప్రహరీ లేకపోవడంతో ఓ కారు(ఏపీ 40 హెచ్ జె ,3222)వాగులో బోల్తా పడిన సంఘటన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వీరన్నవాగుపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా ప్రహరీ లేదు ఈ కారణంగా ఈ మార్గంలో వెళ్లేవారు వేగంగా వెళ్లిన సమయంలో కారు వాగులోకి దూకింది.

ప్రమాద సమయంలో కారులో ఉన్నవారు బయటికి వచ్చినప్పటికీ కారు వాగులో బోల్తా పడింది. గత కొన్నేళ్లుగా ఈ వాగు బ్రిడ్జిపై ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో పలుమార్లు ద్విచక్ర వాహనదారులు ఈ వాగులో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి ఈ వీరన్న వాగుపై గల బ్రిడ్జిపై ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ఈ విషయంలో స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఓరుగల్లు భద్రకాళి అమ్మవారి ఆలయ వద్ద ఉద్రిక్తత..

### –భద్రకాళి ఆలయంలో రాజకీయాలు తగవు: గంట రవికుమాం



వరంగల్, జులై 3:లక్షలాది మంది భక్తుల విశ్వాసాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దెబ్బతీస్తున్నాయని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. ఓరుగల్లు ప్రజల ఆరాధ్య దైవమైన భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని రాజకీయాలకు వేదికగా మార్చడం సరికాదని అన్నారు.

శనివారం భద్రకాళి ఆలయ పరిసరాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పసుపు నీళ్లు, గంగా, గోదావరి జలాలతో సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను విక్రయిస్తూ, ఆలయాల్లో రాజకీయ డ్రామాలు ఆడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల తీరు సిగ్గుచేటని విమర్శించారు.

దేవాదాయ శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే దేవాలయాల పవిత్రత దెబ్బతినడం బాధాకరమన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వరంగల్ అభివృద్ధి జరగలేదని, కుడా పరిధిలోని విలువైన ప్రభుత్వ భూములను విక్రయిస్తూ ఇరు పార్టీల నేతలు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి, ప్రస్తుత కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామరెడ్డి తడిబట్టలతో ఆలయంలోకి ప్రవేశించి ప్రమాణాలు చేయడం ఆలయ సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. వారి చర్యల వల్ల ఆలయ పవిత్రత దెబ్బతిందని, అందుకే ఆలయ సంప్రోక్షణ చేపట్టామని తెలిపారు.

అవినీతి ఆరోపణలు ఉంటే విచారణ సంస్థల ఎదుట లేదా ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని, పవిత్ర దేవాలయాలను రాజకీయ వివాదాలకు వేదికగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన చర్యలపై దేవస్థానం అధికారులు స్పందించకపోవడం విచారకమన్నారు.

ఆలయ పవిత్రతను భ్రష్టుపట్టించినందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు భక్తులకు, హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దేవాలయాల గేటు వెలుపల రాజకీయ కార్యక్రమాలు నిర్వహించవచ్చని, గర్భాలయం, ఆలయ పరిసరాల్లో రాజకీయాలు చేయడం తగదన్నారు.

వరంగల్ నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ ఆలయం వద్ద జరిగిన పరిణామాలను అడ్డుకోలేదని విమర్శించారు.

ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గంట రవికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మట్టేవాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. మరోవైపు మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ్ రెడ్డి సహా బీఆర్ఎస్ నాయకులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# రైల్వేగేటును ఢీకొట్టిన లారీ

### విరిగి విద్యుత్ తీగలపై పడిన రైల్వేగేటు
### నిలిచిపోయిన రాకపోకలు..



కామారెడ్డి, జులై 4:నిజామాబాద్ నగరంలోని గంజ్ ప్రాంతంలో రైల్వేగేటును ఓ లారీ ఢీకొట్టగా, రైల్వే గేటు ఓ సైడ్ విరిగి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ విద్యుత్ తీగలపై పడింది. ఒక్కసారిగా జరిగిన ఈ పరిణామంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. లారీ ఢీకొని రైల్వేగేటు విద్యుత్ తీగలపై పడిన విషయాన్ని అక్కడ విధులు నిర్వహిస్తున్న గేట్‌మన్ వెంటనే రైల్వే అధికారులకు చెప్పాడు.

దీంతో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ హుటాహుటిన అక్కడికి చేరుకుని, ఆ రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేసింది. పోలీసులు చేరుకొని వాహనాలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి దారి మళ్లించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. రైల్వే గేట్‌మన్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు పట్టుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కామారెడ్డిలో నిర్మాణాల కూల్చివేత

కామారెడ్డి, జులై 4 : కామారెడ్డి పట్టణంలో అక్రమ వెంచర్లపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వికాస్‌నగర్ కాలనీలోని ఏడో వార్డులో అక్రమ వెంచర్లలో చేపట్టిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పర్వతాలు మాట్లాడుతూ.. 7 వ వార్డులో ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు నాలుగు ఎకరాల 39 గుంటల్లో రెండు వెంచర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. అనుమతులు లేకుండా ప్లాట్లు చేసి అమ్ముతున్నారని చెప్పారు.

పోలీసుల సాయంతో వెంచర్లలో ఏర్పాటు చేసిన రోడ్లను తొలగించినట్లు తెలిపారు. గతంలో నోటీసులు ఇచ్చినప్పటికీ వెంచర్ నిర్వాహకులు పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. దీంతో ఆ వెంచర్లపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ములుగు జులై 4: వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మేమంత్ బోర్ఖడే సూచించారు. భారీ వర్షాలు కురిసి, విపత్తులు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. దీనిపై శుక్రవారం కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి నుంచి మండలస్థాఇ వరకు అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ,, సంపత్‌రావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, జులై 4: తెలంగాణా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకాల కోసం అర్హులైన క్రిస్టియన్, ముస్లిం మైనారిటీ యువత, మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి రాంమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు మిషన్, చిన్న వ్యాపారులు, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. tgb-mms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చిన్న వ్యాపారం కోసం 21–55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, ఈ–బైక్,ఈ–స్కూటీ, మోటార్ బైక్ 21–50 సంవత్సరాల వయస్సు ఉండాలని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల వారు రూ. 2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాల వారు రూ. 1.50 వార్షిక ఆదాయం ఉండాలని సూచించారు.

# దేశంలోని పలు ప్రాంతాల్లో 'ఎల్ నినో' కారణంగా తలెత్తిన

## వర్షాభావ పరిస్థితిని, దాని ప్రభావాన్ని సమీక్షించిన కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ, జులై 4:'ఎల్ నినో' కారణంగా దేశంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితిని, దాని ప్రభావాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ సమీక్షించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి సహా పలు మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ... ఎల్ నినో కారణంగా దేశంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితి, సంభావ్య కరువు పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని అన్నారు. ఈ సమయంలో సాగు చేయాల్సిన సరైన పంటల గురించి రైతులకు సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సదా అప్రమత్తంగా ఉండాలని ఆయన వ్యవసాయ మంత్రిత్వ శాఖను, సంబంధిత మంత్రిత్వ శాఖలన్నింటినీ ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జలాశయాలను పర్యవేక్షించాలని జలవనరుల శాఖ అధికారులను శ్రీ షా ఆదేశించారు. పశుగ్రాసం, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్నీ ఆయన స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరా సజావుగా, తగినంత స్థాయిలో జరిగేలా చూసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శిని శ్రీ అమిత్ షా ఆదేశించారు.

దేశంలో బియ్యం, గోధుమలు సహా అత్యవసర ఆహార ధాన్యాలు తగినంత పరిమాణంలో అందుబాటులో ఉన్నాయనీ, నిత్యావసర వస్తువుల ధరలూ స్థిరంగా ఉన్నాయని కేంద్ర హోం మంత్రి తెలిపారు.

ఈ సమావేశానికి వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ... జలవనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ... వినియోగదారుల వ్యవహారాల శాఖ... మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ... పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ... విద్యుత్ మంత్రిత్వ శాఖ... గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ... శాస్త్ర సాంకేతిక శాఖల కార్యదర్శులతో పాటు జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) సభ్యులు, పలు విభాగాల అధిపతులు, భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) డైరెక్టర్ జనరల్, కేంద్ర జల సంఘం ఛైర్మన్, భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ, జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహా పలు శాఖల అధికారులు హాజరయ్యారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ప్రభావితమయ్యాయి. అస్సాంలోని పలు జిల్లాల్లో వరద నీరు పెరుగుతుండగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అనేక కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, రహదారులు మూసుకుపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయని కేంద్ర హోం మంత్రి తెలిపారు. జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన అంతర్–మంత్రిత్వ శాఖల కేంద్ర బృందాన్ని (ఐఎంసీటీ) అస్సాం, అరుణాచల్ ప్రదేశ్‌లకు పంపాలని ఆయన ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, మానవ నివాసాలకు జరిగిన నష్టం తీవ్రతను అంచనా వేయడానికి ఐఎంసీటీ నిర్వహించే ఈ క్షేత్రస్థాయి అంచనా చాలా అవసరం.

## చల్లబడిన వాతావరణం అన్నదాతల్లో ఆశలు



హనుమకొండ జూలై 4 : ఉమ్మడి జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షం మెట్ట పంటలకు ప్రాణం పోసింది. దినదినం తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్న అన్నదాతల్లో ఈ వాన ఆశలు చిగురింపజేసింది. వానకాలం ప్రారంభమై నెల రోజులు దాటినప్పటికి ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు పడలేదు. చిన్నచిన్న జల్లులే అక్కడక్కడా కురిశాయి. ప్రతి ఏటా కురవాల్సిన వర్షపాతం కంటే 69 శాతం లోటు వర్షపాతం నమోదై తీవ్ర కరువు సంకేతాలనిచ్చింది. హనుమకొండ జిల్లాలో సుమారు 12,300 ఎకరాల్లో మాత్రమే పత్తి విత్తనాలను రైతులు నాటగా, కొందరైతే కనీసం దుక్కులు కూడా దున్నలేని పరిస్థితి ఉంది. ఈ తరుణంలో ఇప్పుడు కురిసిన వర్షం పత్తి రైతులకు ఊరటనిచ్చేలా మారింది.

జిల్లాలో సాధారణ పత్తి సాగు 80వేల ఎకరాలు కాగా ఇప్పటికే రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేసి పెట్టుకున్నారు. ప్రస్తుత వర్షం భూమిలో వేడిని మొత్తం వెళ్లిపోయే స్థాయిలో పడటంతో విత్తనాలను పూర్తి స్థాయిలో నాటుకునే అవకాశం ఉంది. జిల్లాలో సుమారు లక్ష నలభై వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా కాగా, ఇందుకు తగ్గట్టుగా రైతులు నార్లు పోసుకున్నారు. అయితే పొలాలు దున్నాలంటే మాత్రం భారీ వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వరంగల్ నగరంలో వర్షానికి రోడ్లపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. హనుమకొండ, వరంగల్‌తో పాటు ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, వాజేడు, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

# కరినగర పురవీధుల్లో జగన్నాథ రథయాత్రను విజయవంతం చేద్దాం

### – బండి సంజయ్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి



హైదరాబాద్, జులై 4:జూలై 16, 2026 గురువారం రోజు మధ్యాహ్నం మహాలక్ష్మీ దేవాలయ ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో అశేష భక్తకోటి పాల్గొని రథాన్ని లాగుతూ మోక్షమూ పొందాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ రోజు ఇస్కాన్ నరహరి ప్రభు జీ నాయకత్వంలో శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ నిర్వహించిన గోడ పత్రిక ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొని వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ జగన్నాథ, బలభద్ర, సుభద్ర తోబుట్టువులు రథంపై కొలువైన పుణ్య యాత్రలో మహాశక్తి దేవాలయం నుంచి మంకమ్మ తోట, తెలంగాణ చౌక్, బస్టాండ్, టవర్ సర్కిల్ గుండా వైశ్య భవన్ వరకు జరుగుతుందని తెలియ జేశారు. ఈ రథయాత్రకు కావలసిన ఏర్పాట్లను చేయూ ల్సిందిగా భక్తులను కోరారు. జగన్నాథుడి రథాన్ని లాగే అవకాశం కరినగరం హిందూ బంధువుకు దకడం మహా భాగ్యమని అన్నారు. కరినగర ంలో ఐదోసారి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకోవాలని, రథం లాగావుని అదృష్టాన్ని చేజిక్కించుకోవాలని నరహరి ప్రభు జీ అన్నారు. జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ పక్షాన కన్న కృష్ణ జరుగుతున్న ఏర్పాట్లను బండి సంజయ్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కన్న కృష్ణతో పాటు కమిటీ సభ్యులు డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, బుర్ర మధుసూదన్ రెడ్డి, కొామురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# కొణిజేటి రోశయ్యను స్మరించుకున్న ప్రజాప్రతినిధులు



అమరావతి, జులై 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్, దివంగత కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభలో ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని శాసనసభ మెంబర్స్ లాంజ్‌లో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రజా జీవితం, పరిపాలనలో అందించిన సేవలను స్మరించుకున్నారు.

కొణిజేటి రోశయ్య సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారని నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, ఆర్థిక మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా కూడా రాజ్యాంగబద్ధ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించారని కొనియాడారు.

ఈ నివాళి కార్యక్రమంలో శాసనసభ, శాసనమండలి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని దివంగత కొణిజేటి రోశయ్యకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన నిజాయితీ, నిరాడంబరత, ప్రజాసేవ పట్ల అంకితభావం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.


## బాసరలో అధికారుల బృందం పర్యటన



బాసర, జులై 4: బాసర అమ్మవారి ఆలయాన్ని శనివారం అధికారుల బృందం పరిశీలించింది. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఈఎన్సి వసంత నాయక్, ఆలయ ఈఓ అంజనీదేవి, స్థాపతి మోతిలాల్, ఆర్కిటెక్ మాధవి లత ఇతర ఇంజనీరింగ్ అధికారులు ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనుల స్థలాలను పరిశీలించారు. ముందుగా చేపట్టి ఆలయ గర్భాలయ పరిసరాలను పరిశీలించరు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను పెట్టే బాలాలయాన్ని సందర్శించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టి క్యూ లైన్ అక్షరాభ్యాస మండపం తదితర పనులను పరిశీలించారు. వీరి వెంట ఆలయ సిబ్బంది అధికారులు ఉన్నారు.

బాసర అమ్మవారిని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ఈఎన్సి వసంత నాయక్, స్థాపతి మోతిలాల్, ఆర్కిటెక్ మాధవి లత అమ్మ వాణి దర్శించుకుని పూజలు చేశారు. వీరికి ఆలయ అధికారులు సాధర స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో వీరిచే ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతి నిచ్చి ఆశీర్వదించారు.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ



జూలై 5...రావూరి భరద్వాజ జయంతి

ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.

రావూరి భరద్వాజ (జూలై 5, 1927 – (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చుకున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపాడు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింప బడుతుంది. ఈయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన.

తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్నతనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించు కున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు.

రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపం లోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు. 1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు.

ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు.

రావూరి భరద్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరద్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకలనాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు.

1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాదమైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు.

విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలి సరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది.

రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారా వాహికగా వెలువడిన పాకుడురాళు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం.

రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# అత్యాధునిక వైద్య సేవలకు సీఎం చంద్రబాబు శ్రీకారం



## -ప్రతి పౌరుడి ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి: సీఎం

అమరావతి, జులై 4: స్వర్ణ కుప్పం దార్శనిక ప్రణాళిక–2029లో భాగంగా కుప్పం ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిలో రూ.1.70 కోట్ల వ్యయంతో భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ఆధారిత శరీర చిత్రీకరణ (సీటీ స్కాన్) కేంద్రాన్ని, అపోలో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూత్రపిండ శుద్ధి (డయాలసిస్) కేంద్రాన్ని ప్రారంభించారు.

అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న చికిత్స, సంజీవని కార్యక్రమం అమలు తీరును పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు.

సీటీ స్కాన్ కేంద్రాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి, ఈ కేంద్రం ద్వారా కుప్పం, పరిసర ప్రాంతాల ప్రజలకు మెదడు, ఛాతీ, ఉదర భాగాలకు సంబంధించిన వ్యాధులను అత్యాధునిక సాంకేతికతతో స్థానికంగానే గుర్తించే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స ప్రారంభించవచ్చని తెలిపారు.

మూత్రపిండ శుద్ధి కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో ముఖ్యమంత్రి మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 45 వేలకుపైగా డయాలసిస్ చికిత్సలు అందించగా, ప్రస్తుతం 233 మంది నిరంతర చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. రోజుకు మూడు విడతల్లో సుమారు 45 మందికి చికిత్స అందిస్తున్నామని, మరో 500 మంది వరకు వేచి ఉన్నందున సేవలను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. కర్ణాటక, బెంగళూరు, కృష్ణా జిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా రోగులు ఇక్కడికి రావడం సేవల నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

అనంతరం సంజీవని ప్రదర్శనలను పరిశీలించిన ముఖ్యమంత్రి, ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలు ఒకేచోట అందుబాటులో ఉండే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సమాచారాన్ని సమగ్రంగా అనుసంధానం చేసి ప్రతి పౌరుడికి ఒకే ఆరోగ్య చరిత్ర నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే వ్యాధులు ఎందుకు వస్తున్నాయో తెలుసుకుని ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని చంద్రబాబు అన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలి, పర్యావరణ పరిస్థితుల ప్రభావాన్ని సమగ్రంగా విశ్లేషించి ప్రజారోగ్య విధానాలు రూపొందించాలని సూచించారు. రోగులు మందులు సక్రమంగా తీసుకుంటున్నారా, చికిత్స కొనసాగిస్తున్నారా అనే అంశాలను కూడా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముఖ్యంగా అధిక రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నియంత్రిస్తే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

సంజీవని ప్రదర్శనల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగి ఆరోగ్య వివరాలను వెంటనే వైద్యులకు చేరవేసే ఆరోగ్య గుర్తింపు పత్రం, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కృత్రిమ మేధస్సు ఆధారిత రక్త పరీక్ష పరికరం, దృష్టిలోపం ఉన్న చిన్నారుల విద్యకు ఉపయోగపడే సహాయక పరికరాలు, చిన్నారుల్లో మెదడు ఎదుగుదల లోపాలను ముందుగానే గుర్తించే వ్యవస్థ వంటి ఆవిష్కరణలను పరిశీలించి సంబంధిత ప్రతినిధులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

కొత్త ఆలోచనలు రూపొందించడం మాత్రమే కాకుండా వాటి ద్వారా ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగింది, ఎంత మంది ఆరోగ్యవంతులయ్యారు, ఎంత వ్యాధి భారం తగ్గింది, ఎంత వైద్య ఖర్చు ఆదా అయిందనే ఫలితాలను స్పష్టంగా చూపించాలని ముఖ్యమంత్రి సూచించారు. కుప్పాన్ని దేశానికే ఆదర్శ ఆరోగ్య నమూనాగా తీర్చిదిద్దుతూ నివారణ ఆధారిత వైద్య సేవలు, శాస్త్రీయ విధానాలు, సమాచార విశ్లేషణ, ఆధునిక సాంకేతికతను మరింత విస్తరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మూలాలను మర్చిపోవద్దు : వైఆర్పీ ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్

## - విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



నల్లగొండ, జూలై 04 : ఎంత ఎదిగినా తమ మూలాలను మరిచి పోవద్దని వైఆర్పీ ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్ అన్నారు. వైఆర్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైఆర్పీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదివి, మంచి నడవడికతో ముందుకు సాగాలని కోరారు. తమ ఫౌండేషన్ ద్వారా ఈ ఏడాది రూ.80 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. నల్లగొండ జిల్లాలో 41 మంది విద్యార్థులకు రూ.12 లక్షలు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని సూచించారు. తమ సంస్థ చదివే విద్యార్థులకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లను ఉపయోగించుకుని మంచిగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థితికి చేరుకున్న తర్వాత సమాజానికి తోటి విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని చేసిన మేలును మరవద్దని చదువుతోపాటు సంస్కారం కూడా నేర్చుకోవాలన్నారు. ఎవరికి ఇష్టం ఉన్న రంగంలో వారు పట్టుదలతో అంకితభావంతో కష్టపడి చదువుకుని బంగారు భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వై.ఆర్.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిదిస్తున్నామని అలాగే ప్రతి సంవత్సరం మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలు ఇలానే కొనసాగుతాయన్నారు.

ఈ సంవత్సరం సుమారు 80 లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లను 100 మందికి పైగా విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. ఎంత ఎదిగినా కూడా కుల, మత, వర్గ బేధాలు లేకుండా ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలన్నారు. నల్లగొండ కార్పొరేటర్ యామా కవిత మాట్లాడుతూ.. విద్యా దానం అన్నిటికంటే ఎక్కువ అని, ఆది సమాజంలో మార్పు తెస్తుందని అన్నారు. సాయం పొందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఆర్పీ ఫౌండేషన్ డైరెక్టర్ శరత్ చంద్ర, జిల్లా ఇన్‌చార్జి యామా దయాకర్, రవి ప్రసాద్, రాఘవా చారి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: తపస్



ఆదిలాబాద్, జులై 4:ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా కోశాధికారి కిషోర్ కుమార్, జిల్లా సమన్వయకర్త నర్సింగప్ప, మండల అధ్యక్షులు కుంటిమారి కృష్ణఅన్నారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై తాసిల్దార్ అశోక్ కుమార్, కు పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే పెండింగ్ డిఏలు, పిఆర్సి ప్రకటిస్తామని తెలిపినటువంటి ప్రభుత్వం ఇప్పటివరకు నిమ్మకు నేరెత్తినట్టుగా ఉండడం, వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులలో అసహనం పెరిగిందని అన్నారు.

ఉద్యోగులకు రావాల్సినటువంటి డిఏ బకాయిలను ఈ నెల చివరి వరకు వారి అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు సంబంధించినటువంటి 51 శాతం పి.ఆర్.సి అమలు చేస్తూ, వెంటనే 6 డి ఏ లు విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు, టీచింగ్ నాన్–టీచింగ్ ఖాళీల భర్తీ, పదోన్నతులు, బదిలీలు, సీపీస్ రద్దు చేసి ఒపీస్ అమలు, ఎస్ఎస్ ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఎం టి ఎస్ వ్యవస్థ అమలు, ఇతర ఉపాధ్యాయ–ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తపస్ మండల కార్యదర్శి గోపాల్, గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య, కోశాధికా రమేష్, తపస్ జిల్లా నాయకులు కిరణ్, తిరుపతి నాయక్, వెంకటేష్ గనప, మండల నాయకులు బనేష్, పారిజాత, స్వప్న, అంజమ్మ, శిరీష, సుభాని, ఫజలూరి రహమాన్, అశోక్ ,వసుంధర, ధనుంజయ, కేశవులు, రజిత, మహేందర్ , నరసింహ, పృథ్వీరాజ్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహారం కల్తీ చేస్తే పీడీ యాక్ట్ పెడతాం.. సజ్జనార్ వార్నింగ్

హైదరాబాద్, జులై 4: ఆహార కల్తీపై హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ ఉక్కుపాదం మోపుతోంది. మార్చి 19వ తేదీన ఏర్పాటైన హెచ్–ఫాస్ట్ టీమ్.. జీహెచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ, వెటర్నరీ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే 100 రోజుల్లో నగరవ్యాప్తంగా వివిధ జోన్ల పరిధిలో మొత్తం 185 కేసులు నమోదు చేసింది. సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంది. జోన్ల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్‌లో 55 కేసులు నమోదు కాగా, గోల్కొండ జోన్‌లో 44, సికింద్రాబాద్ జోన్‌లో 35, చార్మినార్ జోన్‌లో 21, శంషాబాద్ జోన్‌లో 13, జూబ్లీహిల్స్ జోన్‌లో 12, ఖైరతాబాద్ జోన్‌లో 5 కేసులు నమోదయ్యాయి.

నిత్యం వాడే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌కు సంబంధించి 27 కేసుల్లో ఏకంగా 27,024.7 కేజీల నకిలీ నిల్వలను పోలీసులు పట్టుకున్నారు. కృత్రిమ రసాయనాలతో పండ్లను మగ్గబెట్టే 16 ముఠాల గుట్టురట్టు చేసి 25,845 కేజీల పండ్లను సీజ్ చేశారు. చికెన్ వ్యర్థాల విక్రయాలకు సంబంధించిన 6 కేసుల్లో ఏకంగా 60 టన్నుల కంటే ఎక్కువ చికెన్‌ను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. వీటితో పాటు 3 కేసుల్లో 9,260 కేజీల నిల్వ పచ్చళ్లు, 4 కేసుల్లో 4,030 కేజీల కల్తీ కోవా, 7 కేసుల్లో 3,897 కేజీల నకిలీ టీ పొడి, సుమారు 15 టన్నుల నాణ్యత లేని చికెన్/మాంసం (12 కేసులు), 3,260 కేజీల కల్తీ క్రీమ్, 530 కేజీల కల్తీ నెయ్యి (1 కేసు), సుమారు 2,706 కేజీల నాణ్యత లేని డ్రై ఫ్రూట్స్/ఖర్జూరం (2 కేసులు), 2,500 కేజీల కల్తీ పెరుగు (1 కేసు), 1,514 కేజీల కల్తీ పనీర్ (5 కేసులు), ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో 120 కేజీల నాణ్యత లేని ఫ్రైడ్ చికెన్ (2 కేసులు) స్వాధీనం చేసుకున్నారు. ఐస్ క్రీములు, బిస్కెట్లు, ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, జంక్ ఫుడ్స్ వంటి ఇతర విభాగాల్లో 34 కేసులు నమోదయ్యాయి.

పోలీసు చర్యలతో పాటు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్(ఎఫ్ఎస్ఓ)లకు తదుపరి చర్యల నిమిత్తం 247 కేసులు అప్పగించారు. ఇందులో అత్యధికంగా పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు, ప్రజల నుంచి నేరుగా వచ్చిన ఫిర్యాదులపై 90 కేసులు నమోదు చేశారు. అలాగే సమోసా తయారీ కేంద్రాలపై 11, వాటర్ ప్యాకింగ్ ప్లాంట్లపై 9, మసాలాలు/స్పైసెస్ పై 7, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలపై చెరో 6 కేసులు, జెప్టోపై 5, హాస్టళ్లు, మాంసం దుకాణాలపై చెరో 4 కేసులు, ఐస్ తయారీ కేంద్రాలపై 3, చికెన్ వేస్ట్/సీ ఫుడ్‌పై 3 కేసులు దాఖలయ్యాయి.

పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడం: సజ్జనార్

సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆహార కల్తీ అని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ప్రజల కిడ్నీలను పాడుచేస్తూ, క్యాన్సర్, గుండె జబ్బుల వంటి తీవ్రమైన వ్యాధులను పంచుతూ సామాన్యుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజల ఆరోగ్యంతో, అమాయకుల ప్రాణాలతో ఆడుకునే ఒక ఘోరమైన హత్యాయత్నం అని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ వారి ప్రాణాలు హరించే కల్తీ మాఫియాపై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

ఆహార కల్తీ మహమ్మారిని అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని సజ్జనార్ పిలుపునిచ్చారు. పరిసరాల్లో ఎక్కడైనా ఆహార పదార్థాల కల్తీ జరుగుతున్నట్లు అనుమానం వచ్చినా, లేదా అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నట్లు తెలిసినా ఏమాత్రం సంకోచించకుండా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్–ఫాస్ట్ నంబర్ 8712661212కు వాట్సాప్ లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. ఆర్మూర్ ఎస్సై యాసరి అరాఫత్




నిజామాబాద్, జులై 4:మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఎస్సై యాసరి అరాఫత్ విద్యార్థులకు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఎస్సై యాసిర్ అరఫత్ మత్తు పదార్థాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై మత్తు పదార్థాలు, సీసీ కెమెరాలపై షీ టీం పై పూర్తిస్థాయిలో అనగాన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మంచి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరి పాఠశాల పేరుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్ చంద్రశేఖర్



నల్గొండ, జులై 4: ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను బీఎల్ఓలు, అధికారులు సమిష్టిగా పారదర్శకంగా నిర్వహించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని నందిపాడులో ఇంటింటి సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అర్హులైన వారి ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా బీఎల్ఓలు ఇంటింటి సర్వేలో నమోదు చేయాలని సూచించారు. రాజకీయ పక్షాల నాయకులు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలన జరిపి ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫారాలు నింపి క్రమంలో నిరక్షరాస్యులు ఉన్నట్లయితే బి ఎల్ ఓ బాధ్యత తీసుకుని సరైన సమాచారాన్ని ఓటర్ల నుండి తీసుకుని ఫారాలను పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్, ఆర్ఐ ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.